దేశం ఏమయ్యేట్టు?

[కథల సంపుటి]

గోపీచంద్

అ 6 లు

దేశం ఏమయ్యేట్టు ?

[కథల సంపుటి]

గోపీచంద్

యువ కార్యాలయం

తెనాలి

వీరి ఇతర రచనలు

పట్టాభిగారి సోషలిజం
(రాజకీయం)

భార్యల్లోనే వుంది
(కథలు)

ఉభయ కుశలోపరి
(రేడియో ప్రసంగాలు)

హక్కులు రచయితవి

ప్రథమ ముద్రణ
ఆగస్టు 1942

లక్ష్మీ పవర్ ప్రెస్,
తెనాలి.

దేశం ఏమయ్యేట్టు ?

"ఏమిన్నావటోయ్," అన్నాడు వెంకట్రావు గబగబా పరుగెత్తుకుంటూ వచ్చి.

రామారావు అప్పుడే జపాన్ మిత్రమండలిమీద యుద్ధం ప్రకటించిందనీ, మిత్రమండలికి చాలా నష్టం కలిగిందనీ విన్నాడు. వెంకట్రావు ఆ సంగతే చెబుతున్నాడనుకొని - "జపాన్ సంగతేనా ?" అన్నాడు.

"జపాన్ సంగతి ఇప్పు డెవ్వరికి కావలసి వొచ్చిందోయ్ ! మన ఆచార్యుల సంగతి—"

"ఏం, ఏమయింది ?"

"మన ఆచార్యుల్నీ మరి కొందర్నీ పోలీసులు అరెస్టు చేశారు."

"ఎందుకు, సత్యాగ్రహమేనా ?"

"సత్యాగ్రహం కాదు, పాడూ కాదు," అన్నాడు వెంకట్రావు. "వాళ్ళంతా రోడ్డుకి అడ్డంగా నిలబడి, ట్రాఫిక్ ఆపి పోట్లాడుకుంటూవుంటే, పోలీసులు సర్ద లేక బలవంతంగా లాక్కుపోయి జైల్లో వేశారట !"

రామారావుకి ఆశ్చర్యం వేసింది. ఆచార్యులు గొప్ప రాజకీయవేత్తా, గాంధీ శంఖారావం చెవ్వులో పడ్డప్పటినుంచీ జైలుకి వెళ్తూవస్తూవున్న త్యాగధనుడూ. ఎందుకు రోడ్డుమీద పోట్లాడుకొని జైలుకి వెళ్ళవలసి వచ్చిందో అతనికి అర్థం కాలేదు. అందులో ఈ సమయంలోనా? పరదేశాన్నుంచి మనల్ని రక్షించవలసిన బాధ్యత రాజకీయవేత్తల భుజస్కంధాలమీద (మెద

మీద అయితే బాగుండేది) ఉంది. దేశమంతా ఏకమై, ప్రజలంతా ఒకటిగా లేచి, శక్తిని ఏకోన్ముఖం చేస్తేగాని మనకు దారిలేదు. లేకపోతే ఒకముళ్ళ తోపుకీ బదులు, మరోముళ్ళ తోపుగు తగులుకునే అవకాశం కనిపిస్తూ వుంది.

"దెబ్బలాటేగా ఖన్నా! మిగిలిన వాళ్ళెవ్వరు ?" అన్నాడు.

"ఏమో, నాకింకా పర్టిక్యులర్స్ తెలియవు," అని చెప్పి వెళ్ళిపోయాడు వెంకట్రావు.

రామారావుకి ఏమీ తోచలేదు. ఆలోచించాడు—పిచ్చి పిచ్చిగా వుంది- లేచి అటూ ఇటూ తిరిగాడు— జైలుకి వెళ్ళి సంగతి సందర్భాలు తెలుసుకోవాలని బయల్దేరాడు.

ఊరికి మైలుదూరంలో వుంది జైలు. అది ప్రభుత్వానికి జైలు—దొంగలకు ఖైదు—సత్యాగ్రహులకు శ్రీకృష్ణ జన్మస్థానం. ఊరికి దూరంగా, జనసమ్మర్దనం లేకుండా, నిశ్శబ్దంగా వుంటేగాని ఖైదీలకూ, శ్రీకృష్ణజన్మస్థానవాసులకూ, హృదయ పరివర్తనం కలగదని ప్రభుత్వం ఉద్దేశం కాని క్రియలో మాత్రం హృదయ పరివర్తనం కలగటానికి బదులు మెదడు తిరగబడుతూ వుంటుంది.

రామారావు అధికార్ల దగ్గర పర్మిషన్ తీసుకొని జైలు ప్రవేశించాడు. అనేక గదులు దాటి, అనేక రకాల మనుష్యుల్ని దాటి, నెం. 24 సెల్ దగ్గరకు చేరాడు. ఆ సెల్లో, ఆచార్యులూ, ఒక కాంగ్రెస్ సోషలిస్టూ, ఒక కిసాన్ సభైటూ, ఒక కమ్యూనిస్టూ, ఒక రాయిస్టూ వున్నారు. ఆచార్యులు ఒక మూల కూర్చొని తకిలీ వొడుకుతున్నాడు. కాంగ్రెస్ సోషలిస్టు తల కాళ్ళసందున ఇరికించుకొని కూర్చున్నాడు. కిసాన్ సభైట్

చువ్వల్లోనుంచి దిక్కులు చూస్తూ నుంచున్నారు. కమ్యూనిస్టు ఆవేశంతో అటూ ఇటూ తిరుగుతున్నాడు. రాయిస్టు ఎవరికీ సంబంధం లేకుండా ఒకమూల కూర్చొని పుస్తకం చదువు కుంటున్నాడు.

అటూ ఇటూ తిరుగుతున్న కమ్యూనిస్టు గబగబా ఆచార్యులమీదకు మీదకువెళ్ళి—"తకిలీ వొడికి దేశం తాడు పుటిక్కిన తెంపావ్! ఇకన్నా మానుకుంటావా లేదా?" అన్నాడు.

కాంగ్రెస్ సోషలిస్టు కాళ్ళసందునుంచి తలపైకెత్తి విచారంగా చూశాడు.

కిసాన్ సభైట్, "ప్రజలు మెచ్చుకుంటారని జైటచేస్తే చేశావ్! జైల్లోకూడా ఎందుకయ్యా," అన్నాడు.

రాయిస్టు, "తాత్విక విప్లవం రావాలి. మాటలవల్ల ప్రయోజనం లేదు," అన్నాడు.

ఆచార్యులవారు మాత్రం వీళ్ళమాటలు లెక్కచెయ్యకుండా తకిలీ వొడుకుతూనే వున్నాడు. రామారావు నెమ్మదిగా ఆచార్యుల దగ్గరకువెళ్ళి, "ఆచార్యులూ?" అని పిలిచాడు.

ఆచార్యులు రామారావు గొంతు విని ఉలిక్కి పడ్డాడు, తకిలీ ఆపేశాడు. "ఏమిటిదంతా?" అని అడిగాడు రామారావు.

"అంతా నడమంత్రమోయ్! మనం ఇన్ని సంవత్సరాల నుంచీ దేశంకోసం ప్రాణాలనుకూడా లెక్కచెయ్యకుండా పోట్లాడుతున్నామా? ఇప్పుడు వీళ్ళు—ఈ కుర్రకుంకలు— నాకళ్ళ ముందు పుట్టిన వీళ్ళు—నన్ను తకిలీ మానివెయ్యమంటారా? మానకపోతే నన్ను ఫేసిస్టు అంటారా?" అన్నాడు.

ఈ మాటలు విని మిగిలినవాళ్ళంతా రంయిన ఆచార్యుల

చుట్టూ మూగియ్యారు.

"వినకపోతే నువ్వు ఫేసిస్టువ్," అన్నాడు కమ్యూనిస్టు.

"నా మాట వినకపోతే నువ్వు ఫేసిస్టువ్," అన్నాడు కాంగ్రెస్ సోషలిస్టు.

"నువ్వు పెద్ద పెత్తందారువి. పెత్తనం మా రైతుకూలీ ప్రతినిధులకు వొదిలేవరకూ నువ్వు ఫేసిస్టువ్," అన్నాడు కిసాన్ సభైట్.

"తకిలీ మానినా మానకపోయినా వర్గసంబంధాలనుబట్టి నువ్వు ఫేసిస్టువ్," అన్నాడు రాయిస్టు—"నీ భగవద్గీతా, నీ వేదాలూ, నీ ఆధ్యాత్మిక నాగరికతా అంతా ఫేసిస్టుమయమ్!"

"అవును," అన్నాడు కాంగ్రెస్ సోషలిస్టు.

రామారావుకి అంతా అయోమయం అయింది—"మీరెవరండీ?" అని అడిగాడు.

"నేను కాంగ్రెస్ సోషలిస్టుని," అన్నాడు అతడు.

మిగిలిన నలుగురూ ఫక్కున నవ్వారు. ఆచార్యులు పెద్దమనిషి తరహా కాదనుకొని నవ్వు ఆపుకోటానికి ప్రయత్నించాడు. కిసాన్ సభైట్ కోరచూపులు చూస్తూ నవ్వాడు. కమ్యూనిస్టు గంతులు వేస్తూ నవ్వాడు. రాయిస్టు సంతోషం పట్టలేక ఒక కాగితం తిరగవేశాడు.

కాంగ్రెస్ సోషలిస్టుకి ఉక్రోషం వచ్చింది. బుంగమూతి పెట్టుకొని, "మీ రెప్పుడూ ఇంతే! నేనంటేచాలు, మీరంతా ఏకమవుతారు," అన్నాడు.

"ఏదో పిల్లలు పార్టీలో వుంటామంటే ఉండనిచ్చాం" అన్నాడు ఆచార్యులు రామారావుతో.

"సగం సాలినేతా సగం మాలనేతా?" అన్నాడు కిసాన్ సభైట్.

"రిఫార్మిజం; రిఫార్మిజం," అని కేకలు వేశాడు కమ్యూనిస్టు.

"కాంగ్రెస్సో! సోషలిజమో. కాంగ్రెస్ సోషలిజమ్ ఏమిటి? ఉన్న అవక తవక అంతా పేర్లోనే వుంది. ఈపేరు పెట్టటం ఎన్ని పొరపాట్లో లెక్క వేసుకోండి చెబుతాను —

1 తంత్రరీత్యా పొరపాటు.

2 రాజకీయరీత్యా పొరపాటు.

3 సిద్ధాంతరీత్యా పొరపాటు.

మేం మొదటి నుంచీ ఈపార్టీ తీవ్రవాదుల్ని మోసం చేస్తుందని చెప్పాం. మీరు విన్నారా?" అన్నాడు రాయిస్టు.

"మేం చెప్పాం. మీ రెప్పుడూ చెప్పలేదు," అన్నాడు కమ్యూనిస్టు.

"మీరు మమ్మల్ని ప్రోత్సాహపరిచి, మాతో కలిసి పనిచేసి ఇప్పు డిలా అంటున్నారా?" అని జాలిగా ప్రశ్నించాడు కాంగ్రెస్ సోషలిస్టు.

"అధికారం స్వాధీనం చేసుకోటానికి అలా నటించాం," అన్నాడు కమ్యూనిస్టు.

"నిజం చెప్పాలంటే మొదటినుంచీ మేం చెబుతున్నాం. ఈ దేశంలో కూలీ రాజ్యం కుదరదనీ, రైతుకూలీ రాజ్యం కావాలనీ మేం మొదటినుంచీ మొత్తుకుంటూవుంటే మీరు మా మాట విన్నారా?" అన్నాడు కిసాన్ సభైట్.

"మీ రెవరండీ?" అని అడిగాడు రామారావు.

"మేం కిసాన్ సభవాళ్ళం"

"పెటీ బూర్జువాలు. సోషలిజం వొప్పుకోండయ్యా అంటే వినరు," అన్నాడు కమ్యూనిస్టు.

"నిన్నటిదాకా మాలో పనిచేసి—" అని ఏదో అనబోయాడు కిసాన్ సభైట్.

"అధికారంకోసం...అధికారంకోసం," అన్నాడు కమ్యూనిస్టు.

"నిజమ్! మా పార్టీ ఒక టుంటే వీళ్ళకి మరొక పార్టీ ఎందుకు చెప్పండి కాంగ్రెస్‌లో," అన్నాడు కాంగ్రెస్ సోషలిస్టు.

రాయిస్టు అందుకున్నాడు—"కాంగ్రెస్ ఉండగా కిసాన్ పార్టీ పెట్టటం ఎన్ని తప్పులో చెబుతాను లెక్కవేసుకోండి—

1 పిస్టపేషణం.

2 పోటీసంస్థ అవటం.

3 స్వతంత్ర్య సంఘ సందోహం అవటం.

కాంగ్రెస్ ఉండగా మళ్లీ కిసాన్ ఎందుకూ? కాంగ్రెస్ ప్రజాస్వామిక విప్లవానికి సిద్ధంగా వుంది. రైతూ ప్రజాస్వామిక విప్లవమే చేస్తాడు."

"అయితే కాంగ్రెస్ విప్లవసంస్థ అని ఒప్పుకుంటారా?" అని ఆదుర్దాగా ఆశగా అడిగాడు ఆచార్యులు.

"ఆఁ, కాంగ్రెస్ విప్లవసంస్థే! కాని నాయకత్వం ప్రత్యాఘాతకం," అన్నాడు రాయిస్టు.

"మరి మీరు కాంగ్రెస్‌లోనుంచి వెళ్ళిపోయారే," అన్నాడు ఆచార్లు.

"తీవ్రవాదులు మా మాటలు వినలేదు. అందువల్ల పద్ధతి మార్చవలసి వచ్చింది."

"పద్ధతా? పతకమా" అన్నాడు కా. సో.

"వాళ్ళకు రెండూ ఒకటే," అన్నాడు కిసాన్.

"రోజు కొక పార్టీ గడియ కొక పతకం," అని కేకలు వేశాడు కమ్యూనిస్టు.

"మీా రెవరండీ!" అని అడిగాడు రామారావు.

"మేం కమ్యూనిస్టులం. మూడో అంతర్జాతీయ శాఖవారం..."

"అదంతా రష్యా సాంప్రదాయం! బొత్తిగా విదేశీయం," అన్నారు ఆచార్యులు.

"అవ్రను ఇక్కడి పరిస్థితులు తెలియవు. సిసలైన సోషలిజం మాది. దేశవాళీసరుకు," అన్నారు కాంగ్రెస్ సోషలిస్టు.

"ఇక్కడేపుట్టి, ఇక్కడే పెరిగి, ఇక్కడే పక్వాని కొచ్చే సోషలిస్టులం మేం," అన్నాడు కిసాన్ సభ్యుట్. "వీళ్ళ కమ్యూనిజం కొత్త పెత్తందారీతనం."

"వీళ్ళింకా బొడ్డు ఊడని కమ్యూనిస్టులు. వీళ్ళని మేం ఇండియన్ కమ్యూనిస్టులు అంటాం. వీళ్ళు తెలుసుకోలేని ఫేసిస్టులు," అన్నాడు రాయిస్టు.

"మీా రెవరండీ?" అని అడిగాడు రామారావు.

"మేం రాయిస్టులం"

"రెనగేడ్స్," అని మొదలు పెట్టాడు కమ్యూనిస్టు. కోపంతో, ఆవేగంతో అతనికళ్ళు ఎర్రబడినై. "వీళ్ళ నాయకుణ్ణి మేం అంతర్జాతీయ పార్టీనుంచి వెళ్ళగొట్టాం. వీళ్ళనాయకుడు చైనాలో ఏమిటో చేశాడు. వీళ్ళ నాయకుడికి ఇంగ్లీషు గ్రామరు రాదు."

"రైటో, రైటో!! మా పార్టీలో జేరతానని, మాకు ప్రణాళిక వ్రాసి ఇచ్చి, జేరకుండా మమ్మల్ని మోసంచేసి

తర్వాత మామీాదే దుమ్మెత్తిపోశాడు," అన్నాడు కాంగ్రెస్ సోషలిస్టు.

"నిజం నిజం. మమ్మల్నీ అలాగే చేశాడు. కాంగ్రెస్లో మరో పార్టీ వుండగూడదని చెప్పి చెప్పి తానే మరో పార్టీ పెట్టాడు," అన్నాడు కిసాన్.

"అంతా కాంగ్రెస్లో చేరి కాంగ్రెస్ని బలపరచమని చెప్పి చెప్పి తాను బయటికొచ్చి మరో పార్టీ పెట్టాడు," అన్నాడు కమ్యూనిస్టు.

"ద్రోహి, ద్రోహి, ద్రోహి," అని కేకలు:

"మీారంతే! పరిస్థితుల్నిబట్టి పద్ధతులు మార్చుకోవటం మీాకు చేతగాదు. యుద్ధం వచ్చింది. ఫేసిజం వస్తూవుంది. మనం మారాలి..."

"ఏం ఫేసిజం వస్తే!" అన్నాడు ఆచార్యులు.

"ఫేసిజం ఇంపీరియలిజం కంటే ఘోరమైంది," అన్నాడు రాయిస్టు.

"అనేది ఒప్పుకుంటాను." అన్నాడు కమ్యూనిస్టు.

"నిజమే!" అన్నాడు కాంగ్రెస్ సోషలిస్టు.

"మేం ఫేసిస్టు వ్యతిరేకతీర్మానం చేశాం," అన్నాడు సభైట్.

"ఆచార్యులవారు ఇంగ్లండు గెలవవలసిందే గాని మేం సహాయం చెయ్యం అంటారు. గెలవవలసిన దానికి సహాయం చెయ్యకపోవటం బుద్ధి జాడ్యం—" అన్నాడు రాయిస్టు.

"అది తప్పే!" అన్నాడు కమ్యూనిస్టు.

"ఈ కమ్యూనిస్టులు ఇంగ్లండు రష్యాకి సహాయం చెయ్యాలి గాని మేం ఇంగ్లండుకి సహాయం చెయ్యం అంటారు."

"అది తప్పే" అన్నాడు ఆచార్యులు.

"కానే కాదు," అన్నాడు కమ్యూనిస్టు.

"కాకపోవచ్చు," అన్నాడు కా. సో.

"కాదు," అన్నాడు కిసాన్ సభైట్.

"ఈయన ఊరకే ఇంగ్లండుకి సహాయం చెయ్యమంటాడండీ. ...జవహరలాల్ మీవాడే గదా..." అని మొదలు పెట్టాడు ఆచార్యులు.

"కాదు"

"కాదు"

"కాదు"

కాంగ్రెస్ సోషలిస్టు అనుమానిస్తూ వూరుకున్నాడు.

"పోనీ ఆయన ఎంత బాగా చెప్పాడో చూడండి—"

"చూడం"

"చూడం"

"చూడం"

"ఓ బ్రిటిష్ ఇంపీరియలిజమా నువ్వు వెళ్ళిపో అన్నాడు జవహరలాల్" అని చెప్పాడు ఆచార్యులు.

రాయిస్టూ, కిసాన్ సభైటూ, కమ్యూనిస్టూ బిగ్గరగా నవ్వేతారు.

"ఇంపీరియలిజం పొమ్మంటే పోతుందా?" అన్నాడు కమ్యూనిస్టు.

"మనల్ని అడిగి వొచ్చిందా మనం పొమ్మంటే పోటానికి?" అన్నాడు కిసాన్ సభైట్.

"పోకపోతే ఏం చెయ్యాలో చెప్పాలి," అన్నాడు రాయిస్టు.

"నువ్వు చెబుతావా?" అని అడిగాడు ఆచార్యులు.

ఓ," అన్నాడు, రాయిస్టు.

అక్కర్లేదు. నువ్వు ఇంపీరియలిస్టు ఏజంటువి," అన్నాడు కమ్యూనిస్టు.

"అవును. చెప్పక్కర్లేదు," అన్నాడు కిసాన్ సభైట్.

"అయ్యా రాయిస్టులమాటలు నమ్మకండి. వాళ్ళు స్వామి ద్రోహులు," అన్నాడు ఆచార్యులు.

"అవును ద్రోహులు," అన్నాడు కాంగ్రెస్ సోషలిస్టు.

"ఎన్ని పార్టీలు మారారో కనుక్కోండి," అన్నాడు కమ్యూనిస్టు.

"ఆ విషయంలో వీరు మరీ గొప్పవారండీ," అని కమ్యూనిస్టుని చూపించాడు ఆచార్యులు.

"ఓరి ఫేసిస్టూ... మేం అధికారం స్వాధీనం చేసుకోడానికి ఆలాంటి పనులు చేస్తాం," అన్నాడు కమ్యూనిస్టు.

"మీ యిద్దరూ ఫేసిస్టులే," అన్నాడు కిసాన్.

"మీరు ముగ్గురూ ఫేసిస్టులే," అన్నాడు రాయిస్టు.

"ఇక ఫేసిస్టు కానిది ఎవరు ?" అని అడిగాడు రామారావు.

"నేను"

"నేను"

"నేను"

"నేను"

"నేను"

"ఇక ఫేసిస్టు ఎవరు ?" అని ప్రశ్నించాడు రామారావు.

వాళ్ళు నలుగురు

"వాళ్ళు నలుగురు"

"వాళ్ళు నలుగురు"

"వాళ్ళు నలుగురు"

"వాళ్ళు నలుగురు"

ఈ కేకలతో జైలంతా దద్దరిల్లిపోయింది. అలారం బెల్ గణ గణా మోగింది. వార్డర్ పరుగెత్తుకుంటూ వచ్చాడు. సెల్‌లో వాళ్ళంతా కేకలు పెట్టుకుంటూ "నువ్వు ఫేసిస్టువి" అంటే "నువ్వు ఫేసిస్టువి" అని చేతులు చేతులు కలుపుకున్నారు.

రామారావు బిక్క మొహం వేసి, ఆ దృశ్యాన్ని చూడలేక ఆ మోత భరించలేక, కళ్లు మూసుకొని, చెవులు మూసుకున్నాడు.

రామారావుకంతా అయోమయంగా వుంది. దేశంలోని రాజకీయ పార్టీలు యీ విధంగా వుంటే దేశం ఏమయ్యేటట్టో అతనికి బోధపడలేదు. బయటకు వచ్చి విచారంగా జైలువరండాలో నడుస్తుంటే ఒక వ్యక్తి యిలా అడిగాడు—

"ఎక్కడినించి వస్తున్నారు?"

"నెం 24."

"వాళ్ళేమన్నా కలిసేటట్టున్నారా?"

"లేదు!"

"బలే! హిందూదేశం హిందువులది. వీళ్ళంతా మహమ్మదీయులకు దేశాన్ని అమ్మాలని చూస్తున్నారు."

"తమ రెవరు?"

"హిందూమహాసభ వాళ్ళం."

రామారావు మాట్లాడలేదు. అతడు "అఖండ హిందూస్తాన్" "అఖండ హిందూస్తాన్" అని కేకలు వేస్తూపోయాడు.

రామారావు రెండడుగులు వేసేసరికి మరొక వ్యక్తి వచ్చాడు.

"ఏదో తమరు హిందూ మహాసభవారితో మాట్లాడుతున్నారే!" అన్నాడు.

"అవును."

"ఏమంటున్నారు ?"

"నెం 24 సంగతి అడిగాను."

"నాకు తెలుసు. మొదటినుంచీ మేం అనుమానిస్తూనే వున్నాం. వాళ్ళంతా సమయం వచ్చేసరికి ఒక్కటే అవుతారు. వాళ్ళంతా హిందువులే! హిందూ రాజ్యం స్థాపించడానికి ప్రయత్నిస్తున్నారు !!"

"తమ రెవరు ?"

"ముస్లిం లీగ్"

"ఓహో !"

"పాకీస్తాన్, పాకీస్తాన్, పాకిస్తాన్," అని కేకలు వేసుకుంటూ అతను వెళ్ళిపోయాడు.

రామారావు వుక్కిరి బిక్కిరి అయ్యాడు. పిచ్చి ఆసుపత్రిలో అడుగు పెట్టాననుకున్నాడు. జైలు గేటుదాటి బైట అడుగు పెట్టేటప్పటికి, "బర్మామీద బాంబులు" "జపాను విజయాలు" "బర్మామీద బాంబులు" "జపాను విజయాలు" అని పేపర్లు అమ్మేకునే పిల్లల కేకలు వినిపించినై. ఇక రామారావుకి ఒక్క అడుగూకూడా ముందుకు పడలేదు.

మరొక వ్యక్తి నెమ్మదిగా అతన్ని సమీపించాడు. బిళ్ళ గోచీ పెట్టాడు. లాల్చీ తొడిగాడు. జరీ అంచు కండువా వేశాడు. నెమ్మదిగా రామారావు దగ్గరకు వచ్చి "ఏమండీ ?" అన్నాడు.

రామారావు వులిక్కి పడ్డాడు.

"మన సంగతి ఏమన్నా తేలిందా, అన్నా?" అని అడిగాడు నూతన వ్యక్తి.

"ఏం సంగతి ?"

"ఆంధ్రరాష్ట్రం"

రామారావు తల గిర్రున తిరిగింది. ఆవ్యక్తిని చూడలేక పోయాడు. సహించలేక పోయాడు. ముందుకి చూశాడు. అంధకారం. ఇదివరకు సాధారణంగా అతనికి మూడు ప్రశ్నలు తడుతుండేవి. ఇప్పుడు ఒక్కటే ప్రశ్న—మూడుసార్లు తట్టింది.

1 దేశం ఏమయ్యేటట్టు ?
2 దేశం ఏమయ్యేటట్టు ??
3 దేశం ఏమయ్యేటట్టు ???

జపాన్ బర్మాని ఆక్రమించుకోక ముందూ, కమ్యూనిస్టు పార్టీ ఇది ప్రజాయుద్ధ మనే విషయం గ్రహించకముందూ వ్రాసిన కథ ఇది.

కార్యశూరుడు

శిశిరకుమారబాబు రైలు దిగాడు. అది అట్టే పెద్దస్టేషన్ కాక పోవటంవల్ల ప్రయాణీకులు ఎక్కువమంది లేరు. సామాన్లు మోసే కూలీలు అసలే లేరు. ఒక పోర్టరు మాత్రం ఎర్రజెండా ఆకుపచ్చజెండా కలిపి చుట్టి చంకలో పెట్టుకొని అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఆ రైలు మార్గమంతా తన జండాల ప్రభావం వల్లే నడుస్తూవుందని అతని అహంకారం.

అతన్ని పిలిచి శిశిరకుమారబాబు అడిగాడు — "వెంకయ్యగారిల్లెక్కడ?"

"ఏ వెంకయ్య? ఇక్కడ వెంకయ్యలు కొల్లల కొల్లలున్నారు!" అన్నాడు పోర్టరు.

శిశిరకుమారబాబుకి వెంకయ్య ఇంటి పేరు తెలియదు. తిలకం భర్తని మాత్రమే తెలుసు. ఒక ఫ్యాక్టరీలో మేనేజరనీ, కూలీలతో కలిసి సమ్మె చెయ్యటంవల్ల ఈమధ్యే ఉద్యోగం ఊడిందనీ తెలుసు. ఆ సంగతే పోర్టరుకి చెప్పాడు.

"కామ్రేడ్ వెంకయ్యా! తెలియకేం!" అన్నాడు పోర్టరు.

"ఎక్కడ?"

పోర్టరు పొలాల్లోనుంచి వెళ్ళే కాలిబాటను చూపించాడు. దారి తిరిగినన్ని మెలికెలూ చేత్తో చూపిస్తూ చెప్పాడు: "ఇట్లా వెళ్ళి ఎడంపక్కకి తిరిగి, ముక్కుకు సూటిగా ఇరవై గజాలు నడిస్తే అత డిల్లొస్తుంది."

వానల్లేకపోవటంవల్ల చేన్నీ నెరలిచ్చి వున్నయి. గట్లలో పెద్ద పెద్ద కలుగులున్నాయి. పక్కనున్న ఫ్యాక్టరీ శిథిలమయిన

పురాతనకట్టడంలాగా పడి వుంది. సంస్కృతభాషను తలచుకున్నప్పుడు కలిగే విషాదంకంటే ఎక్కువ విషాదాన్ని కలిగిస్తూ వుంది. ఒక్క ఫ్యాక్టరీగొట్టం మాత్రం ఆ విషాద దృశ్యాన్ని ఛేదించుకొని నిలబడి భవిష్యత్తులోకి చూస్తూ వుంది.

శిశిరకుమారబాబు కాలిబాటనే పడి పోయి పోర్టరు చూపించిన ఇంటిదగ్గరకు చేరుకున్నాడు. అది పూరిల్లు. పొరపాటుపడ్డానేమోనని భవంతికోసం అటూ ఇటూ చూశాడు. కాని దగ్గరవున్నవన్నీ పూరిళ్ళే !

ఆ ఇంటిపక్కనే చెట్టుకింద కూర్చొని చదువుకుంటున్న వ్యక్తి అతన్ని చూశాడు. ఆవ్యక్తి కొంచెం ముతకమనిషి. వాడిచూపులు కలిగిన మనిషి. బాహ్యప్రపంచంసంగతి తప్ప తనజేబుకి చిరుగున్నసంగతే తెలుసుకోలేని మనిషి. భోజనంలోకి బంగాళా దుంపకూర బాగుంటుందో, కాకరకాయపులుసు బాగుంటుందో ఇంకా తేల్చుకోని మనిషి !!

"ఏంకావాలి?" అని అడిగాడు.

"వెంకయ్యగారిల్లిదేనా ?"

"అదే."

"ఆయనభార్య ఇంట్లో వుందా ?"

"ఎవ్వరూ !"

"ఆయనభార్య"

"భార్యలు ఇంట్లో వుండక ఏం చేస్తారు! ఇంట్లోనే వుంటారు. ఎప్పుడూ ఇంట్లోనే వుంటారు," అని చెప్పి ఆవ్యక్తి మళ్ళీ పుస్తకం చదుకోవటం మొదలుపెట్టాడు.

శిశిరకుమారబాబుకి కష్టం వేసింది. "నేను వూళ్ళోవాళ్ళ

భార్యలసంగతి అడగటంలేదు. వెంకయ్య భార్యసంగతి అడుగుతున్నాను," అన్నాడు.

"వెంకయ్యభార్యమాత్రం వూళ్లోవాళ్ల భార్యకాదూ?" అని మొహాన పిసిరికొట్టినట్టు జవాబు చెప్పాడతడు. ఈ సారి తల కూడా పైకెత్తకుండా జవాబుచెప్పాడు.

శిశిరకుమార బాబుకి కోపం వచ్చింది. బొత్తిగా సంస్కారంలేని మనిషి! సోషలిజం ప్రచారంలోకి రాకముందు పల్లెటూళ్లు ఎంత మర్యాదగా వుండేవి! ఈసారి తాను రాసే పుస్తకంలో ఇటువంటి విచిత్రవ్యక్తి నొకణ్ణి సృష్టించి, ఇప్పటి యువకుల్ని దెబ్బతియ్యాలి!

ఇక ఆవ్యక్తితో లాభంలేదని తానే నెమ్మదిగా వెళ్ళి ఆ ఇంటితలుపు తట్టాడు. లోపల అడుగులచప్పుడు వినిపించింది. ఒకక్షణం ఆమే అనుకున్నాడు ఒకక్షణం కాదనుకున్నాడు. ఆ పదధ్వని ఆమెదే అనుకున్నాడు. మళ్లీ కాదనుకున్నాడు.

ఆమే!!!

కాని ఎంత మారిపోయింది! గుర్తుపట్టటానికే వీల్లేకుండా వుంది! అతడు ఆశ్చర్యంతో ఆలాగే నిలబడిపోయాడు. అతన్ని చూచి ఆమెకూడా అంతే — ఆలాగే నిలబడిపోయింది. అతని మొహాన్నుంచి చూపులు తిప్పుకోలేకపోయింది. అతని మొహం మీాద చూపులు ఆనటమూ లేదు. ఆమెకు అతని మొహం అలికినట్లు కనిపించింది. కాని అతనే అని తెలుసు కాని బాధో, ఆనందమో, ఆ వికారం ఏమిటో తెలియటంలేదు. హృదయం మాత్రం చెడిపోయిన గ్రామఫోను రికార్డులా వుద్రుమని మోత పెట్టింది. కదలకుండా, మెదలకుండా, రెప్పవెయ్యకుండా

చూస్తూ అలాగే నిలబడిపోయింది.

శిశిరకుమారబాబుకి ఏమీ తోచక అటుతిరిగి ఇటుతిరిగి, గొంతుసవరించుకొని "ఇప్పుడే వచ్చాను" అన్నాడు.

"రండి"—కాని గడపలోనుంచి కదల్లేదు. కదలటం మరచిపోయింది.

"నిన్ను చూచిపోదామని వచ్చాను," అన్నాడు. ఆమాట ఆమెకు వినిపించింది. ఒక్కక్షణం ఆమె పాలిపోయిన మొహం జీవకళతో ప్రకాశించింది. ఒక్కక్షణం ఆనందంతో చూపులు మెరిసినై. ఒక్కక్షణం పెదిమలమీదికి చిరునవ్వు వచ్చినట్లే వచ్చింది!

"రండి"

ఇద్దరూ లోపలికి వెళ్లారు.

ఆ యింటి కంతకీ అదొక్కటే గది. ఆ గదిలో సామాన్లూ అలంకారాలూ ఎక్కువగా లేకపోయినా, పరిశుభ్రంగా వుంది. అలమరలో పుస్తకాలున్నాయి. కుర్చీకి ఎదురుగా బల్లమీద గ్లోబ్ వుంది. గోడకు భూగోళపటం తగిలించివుంది. పక్కనే ఒక ఫొటోవుంది—అదెవ్వరిదో శిశిరకుమారబాబుకి తెలియలేదు. అతని ముప్పై సంవత్సరాల జీవితంలో ఆ ఫొటో ఎక్కడా తగల్లేదు. ముడివేసుకోవటంచేతగాని నెక్టై, ముడతలుపడ్డ బూర్జీస్కోటూ, బూచివాని బుల్లిగడ్డం, హృదయాంతరాళంలోకి దూసుకుపోయే చురుకుచూపులూ — ఆ ఫొటో ఎవ్వరిదో శిశిరకుమారబాబుకి తెలియలేదు. అసలా ఫొటో వెంకయ్య ఎందుకు తగిలించాడో బోధపడలేదు. అతడీ విధంగా గదిని పరిశీలిస్తుంటే తిలకం అతన్ని క్రీగంట చూస్తూ నిలబడింది. అతడు

రావటం అలాగే సంతోషం కలిగించినా, తా నిటువంటి కొంపలో వుంటున్నాననే సంగతి అతనికి తెలిసినందుకు విచార పడ్డది.

"అంతా బాగున్నారా?" అని అడిగింది.

"అంతా ఎవ్వరు? నే నొక్కణ్ణే వున్నాను," అన్నాడు. అతనికి తల్లిదండ్రులు చిన్నతనంలోనే పోయారు. మరింకెవ్వరూ లేరు. ఆ సంగతి ఆమెకు తెలుసు. "నువ్వో" అని అడిగాడు.

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. అతను చూస్తాడేమో నని భయంతో అతని వైపుకి వీపు తిప్పి పుస్తకాలు సర్దుతూ నుంచుంది. పుస్తకం అందుకొని పుస్తకాలకింద వున్న పేపరు తీసే టప్పటికి అలమారులోని పుస్తకాలన్నీ కిందపడి మోతచేసినాయి. దడ దడ కొట్టుకునే హృదయంతో ఆమె అలాగే నిలబడింది.

మళ్ళీ బాబే అడిగాడు: "మీవా రెక్కడో మేనేజ రని విన్నాను."

"అవును"

"బాగున్నారా?"

"రిజైనిచ్చారు"

"ఎందుకు?"

"ఏమో!"

"ఇప్పుడేం చేస్తున్నారు?"

"సమ్మెలు చేస్తున్నారు." ఇక అక్కడ వుండలేకపోయింది. తడబడుతూ గబగబా లోపలకు వెళ్ళిపోయింది.

ఏవేలా వున్న వెంకయ్య ఉద్యోగానికి రిజైనివ్వటం ఆమెకు ఇష్టంలేదని శిశిరకుమారి బాబు గ్రహించాడు. గ్లోబ్ గిర్రున

సంతోషంతో తిప్పాడు. దేశాలు వస్తున్నై — పోతున్నై. మళ్ళీ ఆ దేశాలే వస్తున్నై — మళ్ళీ అలాగే పోతున్నై. కాలచక్రం కంటే అనేకరెట్లు వేగంగా తిరుగుతూవుంది గ్లోబ్. అతను దాన్ని తదేకధ్యానంతో చూశాడు. ఆయిదారుసంవత్సరాల కిందట జరిగిన తను కథను జ్ఞాపకంచేసుకోటానికి యత్నించాడు:

అప్పుడతను కాలేజీలో బి ఏ. చదువుతుండేవాడు. తిలకం ఇంటర్మీడియట్ చదువుతూవుండేది. అతను కాలేజీ మేగజీన్లో పద్యాలు వ్రాశాడు. వాటిని తిలకం చదివి కనిపించి అతని పద్యాలు పొగిడింది. అప్పట్నుంచీ ఇద్దరికీ స్నేహం కుదిరింది. అతను తాను వ్రాసిన పద్యాలు చదివి వినిపిస్తే ఆమె విని సంతోషించేది. కాలేజీ విడిచిన తర్వాత ఇద్దరూ జోడీగా షికారు వెళ్ళేవారు. సముద్రతీరాన కూర్చొని సముద్రాన్ని తిలకించేవారు. సూర్యాస్తమయాన్ని తిలకించేవారు. ఎంతో ఆనందం పొందేవారు. ఆ వాతావరణంలో అతడు వ్రాసిన ప్రేమగీతాలు అర్ధనిమీలిత నేత్రాలతో పాడేవాడు. ఆమె తన ఆనందాన్నంతా నిట్టూర్పుల్లో విడిచేది! కాని రోజులు ఒకేరకంగా గడవ్వు. ఒకరోజు ఇద్దరికీ తగాదా వచ్చింది — చాలా స్వల్పవిషయం. తిలకం పన్నీరు పువ్వుని చూచి, "ఈ ముండ్లచెట్టుకి అంతసువాసనగల పువ్వు ఎలాపుట్టిందో!" అన్నది. శిశిర కుమారబాబు "చిద్విలాసం! వికారంగావుండే నీ తండ్రికి నువ్వెలా పుట్టావు?" అన్నాడు. అతను నవ్వులాటకే అన్నాడు. కాని ఆమెకు కోపం వచ్చింది. అప్పటినుంచీ తన్ని కలుసుకోవటం మానేసింది. కొన్నాళ్ళకు ఒక ఫ్యాక్టరీ మేనేజర్ని వివాహంచేసుకుందని తెలిసింది. తన మీద కసితీర్చుకోటానికే అలాగ చేసిందనుకున్నాడు శిశిర

కుమార్ బాబు. తరవాత మరికొన్ని సంగతులు తెలిసినయి. తిలకంభర్త పోషలిస్టనీ, తన్తో తిలకం సరిగ్గా కాపరం చెయ్యటం లేదనీ......

ఈవిధంగా ఆలోచించుకుంటూ, తిలకం కాఫీ తెచ్చి బల్ల మీద పెట్టేవరకూ అతను గమనించలేదు :

" పుచ్చుకోండి "

" ఆఁ "

" పుచ్చుకోండి "

" నాకోసం ఎందు కింత శ్రమ ? "

" ఇది మాకాఫీకైనమే ! "

శిశిరకుమారబాబుకి ఆశాభంగమైంది. "మీకోసంకాకపోతే ఇంకెవరి కోసం శ్రమపడతాను," అంటుం దనుకున్నాడు. నెమ్మదిగా ఆమెను చూస్తూ కాఫీ ఒకక్క గుటక వేశాడు.

" బాగుంది. నీచేతి కాఫీయేనా ? "

" కాదు. "

ఆమె మనస్సులో మనస్సులేక కాదని జవాబు చెప్పింది. లేకపోతే కాఫీకూడా తానే చేస్తున్నాననే సంగతి అతనికి తెలియనివ్వటం ఇష్టంలేకో, లేకపోతే ఇం కెందుకో ! ఆలోచించకుండా జవాబు చెప్పింది. కాని అతనికి మాత్రం ఆజవాబు హాయిని కూర్చింది. చమతక్కరిస్తున్న దనుకొని సంతోషంతో బిగ్గరగా నవ్వాడు. ఆమె తబ్బిబ్బుపడి అతన్ని వెకిలిగా చూచింది.

ఇంతలో బయటనుంచి అడుగుల చప్పుడు వినిపించింది. ఆమె మాట్లాడకుండా, చిలిలోకి నడిచే సలిలాగా నడిచి తలుపు దగ్గరకువెళ్ళింది. బయట పుస్తకం చదువుతున్నవ్యక్తి మరిద్దరితో

ప్రవేశించారు. శిశిరకుమారబాబు నవ్వు విని ముగ్గురూ వాకిట్లో ఆగారు. చెట్టుకిందనుంచి వచ్చిన వ్యక్తి చిటచిటలాడుతూ నిలబడ్డాడు. మిగిలిన ఇద్దరూ పీనుల్లాగు నిలబడ్డారు.

తిలకం తొందరగా పరిచయం చెయ్యటానికి ప్రయత్నించింది: "వీరు శిశిరకుమారబాబు—"

అంతే! ఆ పేరు వినేటప్పటికే వెంకయ్య ముఖ కళ వళికలు మారిపోయినై. అంతకంటే చెప్పటానికి అవకాశం ఇవ్వలేదు. చిరునవ్వుతో శిశిరకుమారబాబు దగ్గరకువచ్చి, "మీరా? ఎవ్వరో అనుకున్నాను. క్షమించండి. మీ పరిచయం చేసుకోవాలని చాలా రోజుల్నించీ ప్రయత్నిస్తున్నాను. నా భార్య మిమ్మల్ని గురించి చాలా చెప్పింది. మీరు రాసినపుస్తకాలన్నీ మా ఇంట్లో వున్నాయి. మీ ఆఖరి విరహవేదనకూడావుంది. నా భార్యకు మీపుస్తకాలంటే చాలా మక్కువ. భోజనం కూడా మానేసి, నన్నుకూడా వొదిలేసి చదువుతూ వుంటుంది," అని కరస్పర్శ చేశాడు.

శిశిరకుమారబాబు కలవరపడ్డాడు. వెంకయ్య తన్నింత హృదయపూర్వకంగా ఆహ్వానిస్తాడని ఆతడనుకోలేదు. తన్ను చూడగానే చొక్కా చేతులు పైకిమడిచి 'వర్గకలహం' 'విప్లవ చైతన్యం' 'రుధిరం' 'రక్తం' అంటాడనుకున్నాడు.

తిలకం సమాధిలాగు నిలబడి చూస్తూవుంది.

వెంకయ్య తనస్నేహితుల్ని పరిచయం చేశాడు.

అందులో వొకరు సర్దార్ సుబ్బావధాన్లు. వారు ఉపన్యాసకులు. ఎండిపోయిన కార్మికుల రక్తనాళాల్లో నూతనరక్తాన్ని ప్రవహింపజెయ్యగలిగిన వక్త. రెండోవారు కా. మేడ్ అచ్చయ్య

గారు— సమ్మెకమిటీ సెక్రటరీ. సమ్మెలు నిర్వహించటంలో అందెవేసిన చెయ్యి. శిశిరకుమార బాబు సర్దార్ సుబ్బావధాన్లుకి షేక్‌హాండ్ ఇవ్వబోతే అతను నమస్కారం పెట్టాడు. కామ్రేడ్ అచ్చయ్యకు నమస్కారం పెడితే అతను సిగ్గుపడి వెకిలినవ్వు నవ్వి తల వంచుకున్నాడు.

అంతా మళ్లీ కాఫీకి కూర్చున్నారు. మిగిలిన ముగ్గురూ కాఫీ తాగుతూ సమ్మెనిగూర్చి చర్చించుకుంటూవుంటే శిశిరకుమార బాబు ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చున్నాడు.

"ఇక ఒక రోజు కూడా సమ్మెసాగదు కూలివాళ్ళు తిండి లేక చస్తున్నారు," అన్నాడు కామ్రేడ్ అచ్చయ్య.

"ఉపన్యాసాలిద్దాం. మీటింగు పెట్టించు," అన్నాడు సర్దార్ కామ్రేడ్!

"తిండికి లేదంటే ఉపన్యాసాలిస్తానంటావ్! ఇంకా నయం, భావకవిత్వం రాస్తానన్నా?" అన్నాడు కామ్రేడ్ అచ్చయ్య.

"ఏం చేద్దామంటావు?"

"ఏం చెయ్యాలో తెలియటంలేదు. ఏదోవొకటి చెయ్యాలి."

"దేశంలోని మిగిలిన కార్మికసంఘాలను సహాయం చెయ్యమని కోరదాం. ఏదన్నా సహాయం లభిస్తే మరొక వారం రోజులు గడపొచ్చు!" అన్నాడు వెంకయ్య.

"ఇలా ఎన్నాళ్లు?" అన్నాడు కామ్రేడ్.

"వారం రోజులు గడిస్తే చాలు. అప్పటికి యజమాన్లు లొంగొస్తారు," అన్నాడు వెంకయ్య.

"లొంగకపోతే!"

"మనం లొంగాలి"

"ఇంతా కష్టపడి చివరికి ఇంతే! అయితే ఈ బాధలన్నీ ఎందుకూ ?" అని నిట్టూర్చాడు సర్దార్.

"ఈ చిన్న పోరాటాల్లో జయం లభిస్తుందని గట్టిగా చెప్ప లేం. ఇప్పుడు మనం ఓడిపోయినా అంతిమపోరాటానికి కావల సిన అనుభవం మనకు దొరుకుతుంది. ఈ పోరాటాలవల్ల కార్మి కుల్లో చైతన్యం కలుగుతుంది. అదే ఇప్పుడు మనకు కావల సింది" అన్నాడు వెంకయ్య.

"ప్రపంచ కార్మికులారా! ఏకము కండి," అని మోగాడు సర్దార్.

కాఫీ పూర్తయిం తర్వాతకూడా చాలాసేపు మాట్లాడు కున్నారు. మధ్యమధ్యలో ఉద్రేకాలు పెరిగి దూషించుకొన్నారు. శిశిరకుమార బాబు అయోమయంగా కూర్చున్నాడు. సంస్కారం లేని వాళ్ళని చూస్తే అతనికి అసహ్యం వేసింది. తిలకంలో మార్పు, ఈ కొంపలో ఆమె పడే బాధా స్పష్టం అతనికి అయినై.

ముగ్గురూ లేచారు. వెంకయ్య శిశిరకుమార బాబు వైపుకి తిరిగి, "కొంచెం పనుంది వెళ్ళివస్తాను. నాలుగురోజు లుంటా రుగా," అన్నాడు.

"లేదు. మద్రాసులో కవుల సమ్మేళనకు వెళ్తూ చూచిపోదా మని దిగాను. రేపు ఉదయం వెళ్ళిపోవాలి."

"అలా కాదు. నాలుగు రోజులన్నా వుండాలి," అని వెంకయ్య కోరాడు.

"వుండండి" అన్నాడు సర్దార్.

"వుండండి" అన్నాడు కామ్రేడ్.

తిలకం చూపుల్తో ప్రార్థించింది. అతను కష్టంమీద అంగీక

రించాడు. వెంకయ్య బయటికి వెళ్తూ జ్ఞాపకంచేశాడు: "నాలుగు రోజులంటే, నాలుగురోజులు."

* * * *

మర్నాడు వెంకయ్య రాలేదు. ఈ అయిదు సంవత్సరాల్లో తిలకం అంత సంతోషంగా ఎప్పుడూ లేదు. విద్యార్థిని దశలో వొదిలిన జీవితాన్ని మళ్లీ అందుకుంది. తోటలో కూర్చుని శిశిరకుమారబాబుతో కబుర్లు చెప్పుకుంది. పూర్వ దృశ్యాలన్నీ జ్ఞాపకం తెచ్చుకొని ఆనందంతో పొంగిపోయింది. అతడు రాసిన పద్యాలను చదివి వినిపించమని కోరింది. అతడు గొంతు బిగబట్టి, విగ్గు చేత్తో సవరించుకుంటూ, అర్ధనిమీలిత నేత్రాలతో పాడి వినిపించాడు:—

నీ తలలోని పువ్వునై
నీ జడలోని గంటనై
కంటిమీది రెప్పనై
జాకెట్టు చుక్కనై
నివసిస్తాను
వసియిస్తాను!
నీవుకట్టిన నీలాంబరాలలో
నీవుతొడిగిన సిల్కుజంపర్లలో
కులికించి
మురిపించి
నిద్రపోతాను
నిద్రపోలేను!!

అతని పాటల్ని ఆమె మెచ్చుకుంది. కాని పూర్వం కలిగిన

తన్మయత్వం కలగలేదు. ఆమె భావతంత్రులు తెగిపోయినవా?

ఏమి టిది!

ఏమి టిది!

రాత్రంతా ఏడుపుతో ఆలోచనల్తో నిద్రపోలేదు తిలకం.

*　　*　　*　　*

రెండో రోజుకూడా వెంకయ్య రాలేదు. కూలీలను ఆర్గనైజ్ చెయ్యటానికి వెళ్ళివుంటాడని చెప్పింది తిలకం.

"ఆర్గనైజ్ చేస్తాడా?"

"అవును"

"అంటే!"

"కూలీ లందరు ఏకము కావలెరా!" అని పాడింది. ఇద్దరూ నవ్వుకున్నారు. కాని ఆ రోజు శిశిరకుమారబాబుని పద్యాలు పాడమని తిలకం అడగనూలేదు. అతను పాడనూలేదు. ఆరాత్రి మాత్రం తిలకం పడుకొని 'కూలీలందరు ఏకము కావలెరా!' అనే పాట పదిపన్నెండుసార్లు పాడుకుంది. ఆశ్చర్య మేమిటంటే పాడుకున్నకొద్దీ ఆమె కా పాట బాగుంది. శిశిరకుమారబాబు పాట లివ్వలేకపోయిన ఆనందం ఆ పాట ఇచ్చింది.

*　　*　　*　　*

మూడో రోజుకూడా వెంకయ్య రాలేదు. ఇవ్వాళ తిలకం షికారు వెళ్ళలేదు. శిశిరకుమారబాబు అడిగితే "తలనొప్పిగా వుంది. మీరు వెళ్ళిరండి," అని చెప్పింది. అతను తిరిగి వచ్చే టప్పటికి వెంకయ్య పుస్తకం చదువుతూ కూర్చుంది.

"ఎలావుంది ?" అని అడిగాడు బాబు.

"బాగుంది"

"ఏమిటిది?" - వింతగా అడిగాడు.

"పుస్తకం"

"పుస్తకం కాదు"

"మరేమిటి?"

"తలనొప్పి"

"ఎవ్వరికి?"

ఇక అతను ఎక్కువ ప్రశ్నించలేదు.

* * * *

నాలుగో రోజుకూడా వెంకయ్య రాలేదు. ఇవ్వాళ తిలకం శిశిరకుమార బాబుకి అసలు కనిపించేలేదు. వంటింట్లో కూర్చొని ఆదే పుస్తకం తదేకధ్యానంగా చదువుతూవుంది. శిశిరకుమార బాబుకి ఏమీ తోచక దాసీదాంతో సరసాలాడుతుంటే చూచింది కాని ఏ మాత్రం అభ్యంతరపడలేదు. ఎందుకు పడుతుంది? ఆ పుస్తకంలో ఈ సంభాషణ చదువుతూ వుంది:-

భూదేవి — నీవు ఎందుకు వ్రాస్తున్నావ్?

కవి — కోకిల ఎందుకు పాడుతూవుంది?

భూదేవి — అది పక్షి

కవి — నేనూ పక్షినే!

భూదేవి — నీవు మనిషివి

కవి — అయితే!

భూదేవి — ఆ కృత్రిమ వాతావరణంలో ఊపిరాడక పాతాళలోకంలో పడిపోతావు.

* * * *

అయిదో రోజు వెంకయ్య వచ్చాడు. చాలా గాభరాగా

వున్నాడు. రేగిన జుట్టూ, పెరిగిన గడ్డం, దుమ్ముకొట్టుకున్న బట్టలూ-మాక్సిం గార్కీ పుస్తకం జీవం పోసుకొచ్చినట్లుంది. గదిలో అడుగుపెట్టగానే శిశిరకుమారబాబుని అడిగాడు—

"తిలకం ఏది?"

అతన్ని చూచి శిశిరకుమారబాబు కొంచెం భయపడ్డాడు. ఇలాంటి వ్యక్తుల్ని గూర్చి పుస్తకాల్లో చదవటానికే అతడు భయపడతాడు. ఇక జీవితంలో ఎలా ఎదుర్కొంటాడు?

"తిలకం ఏది?" మళ్ళీ అడిగాడు వెంకయ్య. ఈ సారి వెంకయ్యలో ఆగ్రహంకంటే విచారం ఎక్కువ కనిపించింది.

"వంటగదిలో వుంది," అని చెప్పాడు బాబు.

"వంటగదిలోనా?"

"అవును"

"ఏం చేస్తూవుంది?"

"వంటగదిలో ఏంచేస్తారు?"

"ఇడ్డన్నా?" కోపంగా అడిగాడు వెంకయ్య. కాదు అన్నట్లు తలూపాడు శిశిరకుమారబాబు.

వెంకయ్య ఆలస్యాన్ని భరించలేకపోయాడు. "చెప్పు. ఏం చేస్తూ వుంది?" అని రెండడుగులు ముందుకు వేసి గద్దించాడు.

"చదువుతూవుంది" అని చెప్పాడు బాబు.

"ఏ పుస్తకం? నీ పుస్తకమా?" "కాదు, నీ పుస్తకం"

వెంకయ్య ఒక నిట్టూర్పు విడిచాడు. గ్లోబ్ గిర్రున తిప్పాడు. గబగబా ఫొటోదగ్గరకు వెళ్ళాడు. "ప్రపంచ కార్మికులారా, ఏకము కండి" అని కేక వేశాడు.

ఆ కేకకు శిశిరకుమారబాబు ఉలిక్కిపడ్డాడు. వెంకయ్య

అతనిదగ్గరకు వొచ్చి చెవిలో రహస్యంగా చెప్పాడు: "అయితే ఇక నువ్వెందుకు? నువ్వెళ్లొచ్చు!"

ఈ మాటలకు శిశిరకుమారబాబు నిర్విణ్ణు డయ్యాడు. వెంకయ్యని అర్థంచేసుకోటానికి ప్రయత్నించాడు. తా నేం చేశాడు? వెంకయ్యకోరిక-మీదే వుంటున్నాడాయెను— "మీ కింత కష్టంగా ఉందని తెలిస్తే అసలే వుండేవాణ్ణికాదు," అన్నాడు.

"అదేం మాట! ఉండకపోతే ఎలా?" అన్నాడు వెంకయ్య. అద్దంలో మొహం చూచుకుంటూ, జుట్టు సర్దుకుంటూ మాట్లాడాడు: "మీరు ఉండాలి. అయితే నాలుగు రోజులు మాత్రమే ఉండాలి," అని కులికాడు.

"ఎందుకు?"

వెంకయ్య అద్దం దగ్గరనుంచి శిశిరకుమారబాబు దగ్గరకు వొస్తూ, సీరియస్‌గా చెప్పాడు:– "మీరిద్దరూ ప్రేమించుకున్నారని నాకు తెలుసు. మీ పూర్వపరిచయం నాకు తెలుసు. అందుకనే నిన్ను నాలుగురోజులుండమని బలవంతపెట్టాను."

"ఎందుకు??"

"చెబుతాను. ఇదివరకు మీపరిచయ మల్లా ఎక్కడో ఎప్పుడో కలవటం, కవిత్వం మాట్లాడు కోవటం, తన్మయత్వం చెందటంతో సరిపోయింది. అంతేగాని నిన్ను మనుష్యునిగా అర్థంచేసుకునే అవకాశం తిలకానికి లేకపోయింది. అందుకని నిన్ను గురించీ, నీతో గడపిన 'మధుర' క్షణాలను గురించీ ఎప్పుడూ ఆలోచించుకుంటూ, తన ప్రస్తుత జీవితంతో పోల్చుకొని విచారిస్తుండేది. ఎంతచేసినా, ఎంత ప్రయత్నించినా

కుటుంబజీవితం వేరు, ప్రేమజీవితం వేరు. కుటుంబభారం వుద్రేకంతో కూడిన ప్రేమ జీవితంలా వుండమంటే ఎలా వుంటుంది? ప్రియునికి నుస్తే పొగుడుతూ, వర్ణిస్తూ 'ప్రేయసీ, ప్రేయసీ నీ వాళ్లడనే ప్రేయసీ' అనుకుంటూ తిరగటానికి భర్తకి ఎలా మనస్కరిస్తుంది? ఎలా తీరుతుంది? ఆ సంగతి తెలియక తిలకం తన జీవితాన్ని దుర్భరం చేసుకుంటూవుంది. ఎప్పుడూ కిటికీదగ్గర కూర్చోవటం, నీతో గడిపిన క్షణాల్ని స్మృతిపథానికి తెచ్చుకోవటం, నిట్టూర్పులు విడవటం! ఏం చెయ్యాలా అని నేను చాలా ఆలోచించాను. తిలకం అంటే నాకు చాలా ప్రేమ. ఆమె కష్టపట్టం చూచి సహించలేను. అందుకని నీదగ్గరకువచ్చి నీసహాయం తీసుకుందామనుకున్నాను. అదృష్టవశాత్తూ నువ్వే వచ్చావు," అని నవ్వటం మొదలు పెట్టాడు వెంకయ్య.

శిశిరకుమారబాబు మాట్లాడకుండా వింటున్నాడు. వెంకయ్యనవ్వు అతని హృదయాన్ని దహించివేస్తూవుంది.

వెంకయ్య అంటున్నాడు :—" ఈ నాలుగురోజుల పరిచయంతో ఆమె కైపు దిగిపోయి వుంటుంది. నువ్వెంత సామాన్య మానవుడవో, దుర్భరపురుషుడవో, నీకవిత్వం ఎంత పసికిమాలిందో ఆమెకు తెలిసివుంటుంది. నీ పద్యాలకంటే నే ఫ్యాక్టరీలో రాసే ఎకౌంట్లు ఉపయోగకరమైనవని తెలిసుంటుంది. నువ్వు పాడే పాటలకంటే నేనువాగే సొదా లే ఉపయోగకరములని తెలుసుకుని ఉంటుంది. పైత్యంతో ఎక్కువ కాలం ప్రజల్ని మోసం చెయ్యలేం! అందుకనే నిన్ను నాలుగు రోజు లుండమని కోరాను. నిన్ను అర్థంచేసుకునే అవ

కాశం ఇవ్వటానికి నే నింట్లో లేకుండా వెళ్ళాను. నువ్వు, రాగానే వెళ్ళే ఏమయ్యేదో తెలుసా! ఆమె నిట్టూర్పులు మరీ ఎక్కువయ్యేవి. ఆ సంసారం నాశనమయ్యేది ఇక భయం లేదు. ఇక నీ అవసరం లేదు. నువ్వెళ్ళొచ్చు," అని లోపలికి సంతోషంగా గెంతాడు.

శిశిరకుమారబాబుకి కోపం వచ్చింది. వెంకయ్య తన్ని నీచ కార్యానికి ఉపయోగించుకున్నందుకు కోపం వచ్చింది. భార్యాభర్తల తగాదా తీర్చటానికి తాను సిద్ధంగా వాడుకోబడతానని అతడు కలలో కూడా అనుకోలేదు. అది తన సిద్ధాంతానికి వ్యతిరేకం కూడా! తన సిద్ధాంతం ఈ వూళ్ళో, ఈ ఫ్యాక్టరీ పాగిలో భగ్నమయింది అని ఉక్రోషం వచ్చింది. తిలకంతో చెప్పాలని గబగబా లోపలకు వెళ్ళాడు.

కాని తిలకండికి వెళ్ళేవాళ్ళో వెంకయ్య కనిపించాడు. "ఎక్కడికి?" అని అడిగాడు. "తిలకంతో మాట్లాడాలి"

వెంకయ్య ఈ మాటకు బిగ్గరగా నవ్వాడు—"ఆశకు అంతు లేదు భాయీసాబ్! తిలకంతో నే మాట్లాడుతాను. జరిగిన సంగతంతా చెబుతాను. మీరు వెళ్ళండి వెళ్ళి కవిసమ్మేళనాలు చేయించండి," అన్నాడు.

శిశిరకుమారబాబు కోపంతో తుకతుకలాడి పోయాడు. కాని వెంకయ్య వైఖరి చూస్తే భయంవేసింది! పట్టుపడితే, ఇంకొక్క మాటంటే తంతా డనుకున్నాడు. "ప్రపంచ కార్మికులారా, ఏకముగండు" అని మీదకు దూకుతా డనుకున్నాడు.

"ఎక్స్‌ప్లాయిటేషన్ — ఎక్స్‌ప్లాయిటేషన్" అనుకుంటూ వచ్చిందారి పట్టాడు.

ఆ కా రా లు !

ఆ కటికచీకట్లో ఊరికి దూరంగా ఒంటరిగావున్న ఆమేడ కేపిటలిస్టు దేశాల మధ్యవున్న రష్యాలా వుంది.

అంతవరకే పోలిక!

మొండిగోడలూ—గజిబిజిగా పెరిగిన వృక్షాలతో ఆవరణా—నరాలు జివ్వున లాగే నిశ్శబ్దం—చీకటి పడితే ఆ చాయలకు ఎవ్వరూ పోరు. అటువంటిచోట, ఆ సమయంలో ఆకుల గలగల ధ్వని.

ఎండిపోయిన ఆకులు పాదాలకింద నలుగుతున్న—అప్పడాలు విరుగుతున్న ధ్వని.

బేటరీ లైట్ వెల్తురు, అలా ఒక్క క్షణం నలుదిక్కులా తిరిగింది. వెలిగింది వెలిగినట్లే మూసుకుంది—

మనుష్యుల ఆకారాలు గోడల అంచున కదలుతున్నయ్. అందులో ఒక ఆకారం సరిగ్గా—ర్ది. మిగిలినవి పోలీసులవి.

ఆ ఆకారాలు అడుగుల్లో అడుగులు వేసుకుంటూ గవాక్షాన్ని సమీపించినై. ఇక్కడ గవాక్షంఅంటే రెండు ద్వారాల్లేక తలుపే గనక సరిగ్గల్ ఆకారం నెమ్మదిగా బహుచాకచక్యంగా తలుపు దగ్గర చెవి పెట్టి వింది. ఏమీ వినపడలేదు. ఈసారి చెవుల్ని కొంచం దూరంగా పెట్టి వింది. లోపలనుంచి గుసగుసలు వినిపించినై.

పెద్ద ఆకారాన్ని చూచి మిగిలిన చిన్న ఆకారాలు (హోదాలో సుమండీ) చెవులు రిక్కించినయ్. అది చూచి పెద్ద ఆకారం ముక్కుమీద వేలువేసుకొని వారించింది.

పెద్ద ఆకారం మళ్లీ చెవులు తలుపుకు దూరంగా పెట్టి, ఒకసారి తలుపు ఎగాదిగా చూచి, గొంతులోనే గొంతు సవరించుకొని, చూపుడువేలు ముడిచి కణుపుతో తలుపుకొట్టింది.

ఈసారి చెవుల గొడవ లేకుండానే లోపలనుంచి, అటూ ఇటూ గాభరాగా తిరుగుతున్న పాదాల ధ్వని—చప్పుడు—వినిపించింది.

సరిక్కల్ ఆకారం ఆపుకో లేకపోయింది. "తలుపు" అని గద్దించింది. వెంటనే చిన్న ఆకారాలన్నీ రిక్కించటం మానేసి "తలుపు" అని గద్దించినయ్.

తలుపు నెమ్మదిగా తెరుచుకుంటూ వుంది. లోపలి వెల్తురు తలుపు సందులోనుంచి ప్రసరించి ఈ ఆకారాలను మానవుల్నిగా మార్చింది. 'రెడీ' అన్నాడు సరిక్కల్.

తెరుచుకునే తలుపు మూసుకుపోయింది. అంతా వొక్కసారి కట్టకట్టుకొని తలుపుమీద పడ్డారు. అవి బార్లగా విడిపోయినయ్. పోలీసులంతా గజిబిజిగా గది ప్రవేశించారు.

ఆహా! అయ్యో!!

ఒకమూల వార్తాపత్రికల కట్టలూ—ఒకమూల పుస్తకాల దొంతర్లూ—ఒకపక్క చీట్లపేక ముక్కలూ—ఒకపక్క సిగిరెట్ పీకెలూ. ఇవీ ఆగది రూపరేఖావిలాసాలు.

సరిక్కల్ లోపల గదిలోకి వెళ్లే ద్వారం మూసివుంటం చూశాడు. తలుపుతీసిన కుర్రవాణ్ణి చూచి, "పాతాళహోమం?" అన్నాడు.

"కాదు. పిశాచనృత్యం," అని జవాబు.

పోలీసులు హఠాత్తుగా తలుపు తెరిచి పిస్తోళ్ళు చేతుల్లో

పట్టుకొని—అంతకుముందు వాళ్ళెవరో పట్టుకున్నారనికాదు—రెండో గదిమధ్యకు దూకాడు. గిర్రున మడంమీద తిరిగాడు.

"హాన్డ్స్ అప్" అని గర్జించాడు సర్కిల్.

అదొక గది అని రాశాను. అంతకంటే మరో మాట దొరకక రాశాను. కాని అది గదే! మధ్య వొక డ్రాయరుంది. దానిమీద వెలుగుతూ వెలగని దీపం. దాని పక్కన గ్లోబ్. ఒకమూల ఒక కుర్రవాడు కూచున్నాడు. అతడు మాత్రం పోలీసుల ప్రవేశానికి ముందునుంచీ చేతులు పైకెత్తుకునే కూర్చున్నాడు. మరోమూల మరో కుర్రవాడు—అతని చేతులు మాత్రం దించుకునే వున్నయ్. దించుకునేవున్న చేతుల్తో కంగారుగా చేతిలోని వస్తువు కాగితం కిందకు తోశాడు.

పోలీసులు కాలాంతకులు. ఆవులింపించి పేగులెక్క పెడతారు. ప్రస్తుతం ఆకుర్రవాని చేతి నరాల్లెక్క పెట్టారు. "హాన్డ్స్ అప్" అని అరిచాడు సర్కిల్. ఆ కుర్రవాడు కూడా కిక్కురుమనకుండా చేతులు పైకెత్తాడు. నోట్లో సిగరెట్ పీకమాత్రం అలానే వుంది. దమ్ములాగుతూనేవున్నాడు, పొగ వొదుల్తూనే వున్నాడు.

"ఆకాగితం కింద ఏంపెట్టావ్?" అడిగాడు సర్కిల్.

కుర్రవాడు పొగతో జవాబు చెప్పాడు. "చేతులుపెట్టి కాల్చుకున్నా." మరో దమ్ములాగి, "చేతులు దింపనివ్వండి తీసి చూపిస్తాను," అన్నాడు.

ఒక పోలీసు సర్కిల్ చెవిలో భయం వూదాడు. ముందుకు అడుగువేసిన సర్కిల్ ఆగిపోయి, పోలీసులను ఆజ్ఞాపించాడు—"ఆ కాగితం కింద ఏమిటో చూడండి."

వాళ్ళదిరిపోయారు—పాపం! వాళ్ళవీ ప్రాణాలే! వాళ్ళవీ

పోలీసు హృదయానికే గద! కాని అందులో వొకడికి ప్రాణం కంటే పొట్టతీపు. వాడు వొణుకుతూ వొణుకుతూ వీలయినంత దూరంగా వుండి, కాగితం కొన పట్టుకొని పైకెత్తాడు.

"అమ్మో!" అని కేకవేసి కళ్ళుమూసుకొని చతికిలబడ్డాడు- కూర్చున్నవాణ్ణి కుర్చీ కూడా కరవదు. ఇక బాంబెందుకు పేలుతుంది?

సరిల్ కాగితంకింద వున్న పొట్లాంచూచి గజగజలాడాడు. సూటిగా గుండెమీదే పేలిందనుకున్నాడు.

తీరా అందరూ కళ్లుపెట్టుకొని చూచేటప్పటికి అది పంచ దార బిళ్లల పొట్లాం అయింది.

సరిల్‌కి కోపం వచ్చింది. "ఈ ఇల్లంతా సోదాచెయ్యాలి" అన్నాడు.

"సోదా చేస్తే మీ కవమానం. చెయ్యకపోతే మా కవ మానం. అలాగే చెయ్యాలి," అన్నాడు మొదట్నించీ చేతులు పైకెత్తు కూర్చున్న కుర్రవాడు.

సరిల్ వెంటనే ఆజ్ఞాపించాడు. ఒక పోలీసు, కుర్రవాళ్లని సోదా చేశాడు:—ఒకరి జేబులో వార్తాపత్రికల కటింగులు దొరికాయి. ఒకరి జేబులో సిప్పుల పుల్లలూ చిల్లా దొరికాయి. మరొకరి జేబులో ధర్మామీటర్ దొరికింది.

ఇలాగా సరిల్ వూరుకుంటాడా? గదంతా వెతికి అల మర తెరిచాడు. అందులో మూలగా కనబడీ కనబడకుండా, ఒక సీసా వుంది. దాన్నిండా ఏదో ద్రావకం.

"ఇదేమిటి?" సరిల్ జబర్దస్తీగా కుర్రవాళ్లని అడిగాడు. సిగరెట్ తాగే కుర్రవాడు చెప్పాడు—"సీసా"

"లోపల్ది?" — "ద్రావకం"

"ఏం ద్రావకం?" మీదకు మీదకు వెల్తూ రౌద్రంగా అడిగాడు. కుర్రవాళ్ళు బెదిరారు. వొకరిమొహాలు వొకరు చూచుకున్నారు. — "చెప్పండి" గర్జించాడు సరిహల్.

తలుపు తీసిన కుర్రవాడు చెప్పాడు- "మాకేం తెలుస్తుంది! మేమేం డాక్టర్లమా?"

"అదే తెలుస్తుంది. ఇప్పుడు తెలియకు. రేపు తెలుస్తుంది. కబడ్దార్..." అన్నాడు గర్జాంపోలీసు.

సరిహల్ సీసాను గుడ్డకు చుట్టి భద్రంగా జేబులో పెట్టుకున్నాడు. ఇంతలో పోలీసులు కొంత ఎర్ర అట్టల పుస్తకాలు పట్టుకొచ్చారు. అవన్నీ తీసుకొని కోరచూపులు చూస్తూ పోలీసులు నిష్క్రమించారు. మహానవులు మళ్ళీ గదిలోనుంచి బయటకు అడుగుపెట్టగానే ఆకారాలుగా తయారయ్యారు.

కుర్రవాళ్ళంతా విరగబడి నవ్వుకున్నారు. చేతులు పైకెత్తుకొని కూర్చున్న కుర్రవాడు (ఇప్పుడు దించేశాడు) తలుపు తీసిన కుర్రవాణ్ణి చూచి, "మళ్ళీ డబ్బొచ్చేదాకా నీకు కాడ్లివర్ ఆయిల్ లేదు," అన్నాడు.

"మళ్ళీ డబ్బొచ్చేదాకా నాకు గుండెజబ్బూ వుండదు —" అన్నాడు ఆ కుర్రవాడు.

అంతా నవ్వుకున్నారు.

వెంటనే గ్లోబ్ చుట్టూ మూగారు. వెంటనే బాహ్యప్రపంచాన్ని మరిచిపోయి తర్కంలో పడ్డారు—రష్యా—మధ్యధరా సముద్రం — ఇటలీ — జర్మనీ — యూరప్‌లో సెకండ్ ఫ్రంట్— ఇండియా— ప్రజాయుద్ధం.

పిరికివాడు

శ్రీవదేశంమీదకు పరదేశం దండెత్తి నెమ్మదిగా ఆక్రమించుకుంటున్నదని వినగానే, పిరికివాడు రెండు రకాల జండాలు తయారు చేసికొని కూచున్నాడు - ఒకటి స్వదేశంజండా, ఒకటి దండెత్తివచ్చిన పరదేశం జండా.

'స్వదేశం గెలిస్తే ఈ జెండా, పరదేశం గెలిస్తే ఈ జెండా' అని మనస్సులో అనుకొని, గదిలో ఒకమూల పెట్టాడు. ఇక ఏ దేశం గెలిచినా తన కేమీ పరవా లే దనుకున్నాడు. 'స్వదేశం గెలిస్తే స్వదేశం జెండా వుండనే వుంది. పరదేశం గెలిస్తే పరదేశం జెండా వుండనే వుంది. ఇక నా కేం?' అనుకున్నాడు. పరదేశ సైన్యాధ్యక్షుడిమీద, 'నీకు దీర్ఘాయురస్తు' అని కొన్ని సీసపద్యాలు రాసి తయారుగా వుంచుకొన్నాడు కూడాను.

అసలు పిరికివాడికి రెండు దేశాలు ఎందుకు యుద్ధంలోకి దిగాలో, ఇంతమంది తమ ప్రాణాలను దేశంకోసం ఎందుకు అర్పించాలో అర్థమయ్యేదికాదు. సంకుచితదృష్టి, మూర్ఖత్వం ఈ రెండే దీనికి కారణం అనుకునేవాడు. తాను ఈ కక్షలకు అతీతుడననీ, తన హృదయం అతి విశాలమనీ అనుకునేవాడు. కనుక మూర్ఖులు యుద్ధాలుచేసుకొని రక్తపాతం కలిగించుకునేటప్పుడు తనబోటి విశాలహృదయులు ఏం చెయ్యాలి? తమ సుఖంకోసం తాము పాటు పడాలి. ఆలోచించి పిరికివాడు ఈ నిర్ణయానికొచ్చి దానికోసం పాటుపట్టం మొదలుపెట్టాడు.

కాని యుద్ధం తీవ్రరూపం తాల్చిం దగ్గరనుంచీ పిరికివాడు

తను తలపెట్టిన కార్యం అనుకున్నంత తేలిక కాదని గ్రహిం చాడు. ఏదేశం గెలుస్తుందో ముందే ఎలా తెల్సుకోవటం?

రాత్రంతా ఆలోచించి ఇక స్వదేశం గెలవదు గనుక పరదేశం జెండాపట్టుకొని బయల్దేరదామని నిశ్చయించుకొని తెల్లవారి లేచేటప్పటికి "స్వదేశంసేనలు కొన్ని కొన్ని రంగాల్లో గెలిశాయి," అని పెద్ద పెద్ద అక్షరాల్తో వార్తాపత్రి కలు ప్రచురిస్తూ వుండేవి. స్వదేశంజెండా పట్టుకొని బయల్దేర దామనుకొన్నరోజు, "విదేశసేనలు స్వదేశసేనలను తరిమి వేశాయి," అని వార్తలు వస్తుండేవి.

పిరికివాడికి ఏమీ తోచక, ఏ జెండా పట్టుకొని వూరేగాలో తెముల్చుకోలేక హైరానయి పోయాడు. రెండుజెండాలకూ ఎదురుగా ఎప్పుడూ ఆగదిలోనే కూర్చునేవాడు. తానురాసిన పద్యాలు మోకాలుమీద కూర్చుని రిహార్సల్సు వేసుకునే వాడు. ఒకక్షణం విదేశం జెండా భుజంమీద పెట్టుకొని గదిలో ఇటూ అటూ పచారు చేసేవాడు—ఒక క్షణం స్వదేశంజండా పట్టుకొని గంతులు వేసేవాడు. రెండూ మూలపెట్టి, ఎదురుగా నిలబడి, "స్వదేశం గెలిస్తే ఈజెండా, విదేశంగెలిస్తే ఈజెండా," అని వెర్రిగా అరిచేవాడు.

ఒకరోజు శత్రువు ఆవూరిమీదకే వస్తున్నాడనీ, ఏభై మైళ్ళ దూరంలో వున్నాడనీ వదంతులు ప్రబలినై. సైన్యంలో జేరగా మిగిలిన ధైర్యవంతులు వూరుఖాళీ చెయ్యటం మొదలు పెట్టారు. పిరికివాడికి ఆవేశం ఎక్కింది. ఇన్నాళ్ళనుంచీ తాను వేసుకున్నప్లాను, ఆచరణలో పెట్టి దాని ఫలితాన్ని అనుభ వించే గడియ దగ్గర కొచ్చిందనుకొన్నాడు. కదలకుండా తన

గదిలోని జెండాలకు ఎదురుగా బాచీపెట్లు వేసుక్కూర్చుని, "స్వదేశం గెలిస్తే ఈ జెండా, విదేశం గెలిస్తే ఈ జెండా," అనుకో. "ఈ జెండే, ఈ జెండే, ఇదే జెండా" అనుకుంటూ వెర్రివాడిలా గదంతా చిందులు తొక్కాడు.

ఒక స్నేహితుడు కావలసిన సామానంతా వీపుకు కట్టుకొచ్చి, "రావూ?" అని అడిగాడు.

"నేనా? నేనెందుకురావటం? నేనేం పిరికివాణ్ణా? పిరికి వాళ్ళు పారిపోండి. నేరాను. ఈ జెండా, ఈ జెండా ఈ జెండే," అన్నాడు పిరికివాడు.

బయట ఖాళీ చేస్తున్న జనం కోలాహలం పిరికివాడి గదిలో క్కూడా వినిపిస్తూవుంది. రోడ్లమీద జనం అన్ని దిక్కులకూ తోకలు తెగిన నక్కల్లా పరుగెత్తుతూవుంది. అంతజనంలోనూ బళ్లూ కార్లూ కళ్ళు మూసుకొని తిరుగుతున్నై. మధ్యమధ్య మిలిటరీ కార్లు గంటలు గణగణ మోగించుకుంటూ రంయిన వెళ్తున్నై. దూరాన్నుంచి బాంబులు పేలినధ్వనులువినిపిస్తున్నై. జనానికి ఏంచెయ్యాలో తెలియక, ఎక్కడికి పారిపోటానికీ తోచక, రోడ్డుకి అడ్డంగా, బయల్దేరిన చోటునుంచి పరుగెత్తిన చోటుకీ, పరుగెత్తిన చోటునుంచి బయల్దేరిన చోటుకీ పరిగెత్తుతూ కార్లకిందా బళ్ళకిందా పడి నలిగిపోతూ వుంది. మనుష్యుల్లోని ఈచలనమంతా శారీరకమే! బుర్రలు ఆట్టం ఎప్పుడో మానుకున్నై. యుద్ధంరోజుల్లో బళ్ళే మనుష్యులూ— మనుష్యులే బళ్ళూ!

పిరికివాడు గదిలోనుంచి ఇదంతా చూశాడు. పారిపోతున్న జనాన్ని చూచి తనలోతాను నవ్వుకున్నాడు- "పిరికివెధవలు,"

అనుకున్నాడు. హఠాత్తుగా పరదేశం జెండా పట్టుకొని, "ఈ జెండా, ఈ జెండా, ఇదే జెండా," అనుకుంటూ బజార్నపడ్డాడు.

జనం అతన్ని మిలిటరీ లారీని చూచినట్లు చూచి రెండు పాయలై దారిచ్చింది. పిరికివాడు ఆమధ్యనుంచి పరదేశంజెండా బుజానపెట్టుకొని, "ఇదేజండా, ఒకటేజండా, ఒకటేజండా, ఏకైక జెండా," అని కేకలు పెట్టుకుంటూ పరిగెత్తుతున్నాడు.

జనం విరగబడి తొక్కుకుంటూ ఉందేగాని అతన్ని ఏమీ అనలేదు. గుడ్లువప్పజెప్పి చూస్తూ వూరుకుంది. ఏపని చేస్తున్న మనిషి ఆపని ఆపేసి స్థాణువై నిలబడి చూస్తున్నాడు. బళ్ళూ కార్లే ఎక్కడవి అక్కడ ఆగిపోయినై.

"పాపం పిచ్చెత్తింది" అని కొందరు చప్పరించారు. యుద్ధం నుంచి కాళ్లు విరగ్గొట్టుకొనీ, చేతులు విరగ్గొట్టుకొనీ, మూతులు పగలగొట్టుకొనీ, మెదళ్లు చిట్లగొట్టుకొనీ పిచ్చెక్కి వికృతాకారాలతో రోడ్లమీద తిరిగే మనుష్యుల్ని ఈమధ్య ఆ వూరి ప్రజలు చాలామందిని చూచివున్నారు. అందుకనే తేలిగ్గా 'పిచ్చెక్కింది' అనే నిర్ణయం......

పిరికివాడు ఆవిధంగా పరిగెత్తి పరిగెత్తి వూరిబయటకు పరుగెత్తాడు. అక్కడ ఒక్క క్షణంనిలబడి బాంబులు పేలుతున్న వైపుకి చూశాడు. దూరంగా చెట్లచాటునుంచీ, గుట్టల చాటునుంచీ తుపాకీలతో బిలబిలా పరుగెత్తుకు వస్తున్న సైన్యాన్ని చూశాడు.

చెయ్యి వొణికింది. భుజంమీద వున్న విదేశజండా రెపరెప కొట్టుకుంది. హృదయం ఆవేశంతో తుకతుకలాడింది. తనశక్తి నంతా కేంద్రీకరించుకొని "జై జై! ఈ జెండాకే జై! ఇదే

జెండాకీ జై!" అని కేకలు పెట్టుకుంటూ వచ్చే సైన్యానికి ఎదురుగా మళ్లీ పరుగు లంకించుకున్నాడు. ఒక్కొక్క అడుగు దగ్గరకు వెల్తున్నకొద్దీ గాలే మారిపోతున్నది. ముక్కు రంధ్రాల్ని బద్దలుకొట్టే కంపు. ధాం, ఢీం, ఢూం, అని శూన్యాన్ని కూడా బద్దలుకొట్టే మోతలు. కళ్ళు తెరవటమే కష్టమయింది. అలాగే పిరికివాడు శరీరాన్ని బిగబట్టి పరిగెత్తాడు. భుజంమీద వున్న జెండా గాలికి గిల గిల కొట్టుకుంటూవుంది. హఠాత్తుగా పిరికివాడు భూమిలో గుచ్చుకుపోయినట్లు ఆగిపోయాడు.

అంతా నిశ్శబ్దం. బాంబులమోతలు ఒక్కసారి ఆగిపోయినై. పిరికివాడు నెమ్మదిగా కళ్ళు తెరిచి చూశాడు. శవాలు. ఎటు చూచినా శవాలే! తనచుట్టూ శవాలే!! కొంచెం దూరంలో సైన్యం.

ఆ సైన్యం ఇదివరలోలాగా లేదు. అంతాకలిసి ఉప్పొంగిన హృదయంలాగా, పొంగిన సముద్రంలాగా వొస్తూవుంది. ఆ సైన్యానికి ముందు నడుస్తున్న వ్యక్తిని చూశాడు పిరికివాడు. అతని చేతిలోనూ జెండావుంది. అదీ రెపరెప గిలగిలలాడుతూ వుంది. "జై, జై. ఈ జెండాకీ జై. ఇదే జెండాకీ జై. పరదేశ జెండాకీ జై," అని అరిచాడు పిరికివాడు. కాని ఇదేమిటి? అదేం జెండా!

దిమ్మతిరిగి కళ్ళు బయర్లుకమ్మి పిరికివాడి చూపు సరిగ్గా ఆనటం లేదు. సైన్యం అలికిన గోడలా కనిపించింది. వాళ్ళ చేతుల్లోని తుపాకులు నెమలి పింఛాల్లా విప్పుకుంటున్నట్లు కనిపించాయి. జెండాపట్టుకున్నవ్యక్తి తోలుబొమ్మలా రెల్లుదుబ్బులా కనిపించాడు. అతనిచేతుల్లోని జెండా స్వదేశం జెండా!

కాని పిరికివాడు నమ్మలేకపోయాడు. కళ్లు తుడుచుకొని చూట్టానికి తన చేతులో జెండా వుండి. మళ్ళీ సైన్యాన్ని చూశాడు. స్వదేశ సైనికుల్లా కనిపించారు.

ఏమిటిది? అతని గుండెలు పగిలినై. అది స్వదేశం జెండాయే! అది స్వదేశం సైన్యమే!! తాను పొరపాటుపడ్డాడు. ఈ సంగతి ఆకళింపుకిరాగానే తన గదిలో వున్న స్వదేశం జెండా జ్ఞప్తికి వచ్చింది. కెవ్వున కేక వేసి గిరుక్కునతిరిగి తన ఇంటికి, స్వదేశం జెండాకోసం పరుగు లంకించుకున్నాడు.

ధాం...ధాం.

పరుగెత్తే పిరికివాడి గుండెల్లోకి ఒకేసారి రెండు గుళ్ళు జొరబడ్డాయి. ఒకటి సైన్యంలోనుంచీ, ఒకటి చెట్టుచాటునుంచీ వచ్చినై. ఒకటి వీపులోనుంచీ, ఒకటి రొమ్ములోనుంచీ గుండెల్లోదూరి కలుసుకున్నై. ఆ విశాల హృదయంలో స్వదేశ విదేశ నాగరికతల సమ్మేళన ఈవిధంగా జరిగింది.

“అమ్మో!” అనే భయంకర ఆర్తనాదమే ఈ సమ్మేళన ఫలితం.

పిరికివాడు ఆ రెండు గుండుదెబ్బల్తో కిందపడి, లుంగలుపడి, చాపలా చుట్టుకుపోయి, తల రొమ్ములోకి దూర్చుకొని, ప్రాణాలువొదిలాడు. ప్రాణాలు పోయేముందు ఒక్కసారిమాత్రం పెదవులు కదలినై — “స్వదేశం గెలిస్తే ఈజెండా, పరదేశం గెలిస్తే ఈజెండా!”

ధర్మవడ్డీ

నేనా వూరు ఎందుకు వెళ్ళానో, నాకిప్పుడు జ్ఞాపకం లేదు. కాని వెళ్ళటం, చిన్నప్పటి స్నేహితుడు కనపట్టం, తన ఇంటికి నన్ను తీసుకువెళ్ళటం జరిగింది. కలవక కలవక కలుసుకోవటం వల్ల, చిన్నప్పటి విషయాలు తలుచుకొని నవ్వుకుంటూవున్న సమయంలో ఇతడొచ్చాడు. రావటం రావటం ఎలా వచ్చాడని?

ముందు వాకిలి నెమ్మదిగా తెరిచాడు. కుడికాలు గడపలో పెట్టి అటూ ఇటూ దొంగచూపులు చూశాడు. చంకలో వున్న మూటని కదిలొంగా రెండోచేత్తో పట్టుకొని, తల ఓరగా పెట్టి అడుగులో అడుగు వేసుకుంటూ, నాస్నేహితుని దగ్గరకువచ్చి, చంకలో మూట అందిస్తూ, "ఇదిగోనోయ్, డబ్బు" న్నాడు.

అసలు అతన్ని చూడగానే నాస్నేహితుని కళవళికలు మారిపోయినై. అంతకు ముందున్న సంతోషం మాయమైపోయింది. నెమ్మదిగా మూట అందుకుంటూ "మనిషంటే మనిషివి నువ్వే సూరయ్యా? నికార్సైన మనిషివి" అన్నాడు.

ఈ మాటకు సూరయ్య సంతోషం పైకి కనపడనివ్వకుండా, "మాటలకేంలే! డబ్బు తీసుకోగానే కాదు. నెలరోజుల్లో అసలు ఫాయిదాలు ఇచ్చి వెయ్యాలి. వడ్డీ నీకు తెలిసిందేగా- ధర్మవడ్డీ— నెలకు నూటికి రూపాయున్నర. అదైనా నువ్వని ఇస్తున్నాను," అన్నాడు.

"అలాగే సూరయ్యా, నెలదాటకముందే ఇస్తాను," అన్నాడు నా స్నేహితుడు.

"ఇస్తానంటే కాదు. మాట చెల్లించుకోవాలి. శుభకార్యం ఒకటి తలపెట్టానా? మంచికీ చెడ్డకీ డబ్బు కావాల్సి వొస్తుం టుంది. తర్వాత కోర్టు గీర్టూ అంటే......"

"అ దేమిటి సూరయ్యా! నీ దగ్గర ఎన్ని సార్లు డబ్బు తీసుకోలేదు. ఎన్నిసార్లు ఇవ్వలేదు. ఎప్పుడైనా మాట తప్పేలు వొచ్చిందా?"

"సరేలే. డబ్బు లెక్కపెట్టుకో. అన్నీ రూపాయలే! కొద్దిగా మాత్రం చిల్లర వుంది. మళ్ళీ నాకు రూపాయలే ఇవ్వాలి సుమా! నోట్లూ గీట్లూ అంటే కుదరదు."

"నువ్వు చెప్పాలా, సూరయ్యా" అంటూ నా స్నేహితుడు మూట విప్పాడు. చూసే టప్పటికి నా తల తిరిగిపోయింది. అయోమయం అయిపోయింది. ఆ మూటలో వున్న వన్నీ రాళ్ళే! చిన్న చిన్న రాళ్ళూ, పెద్ద పెద్ద రాళ్ళూ— పెద్ద వన్నీ కంకర రాళ్ళూ, చిన్న వన్నీ గులకరాళ్ళూ! నమ్మలేక నా స్నేహితుని మొహం పరీక్షగా చూశాను. అతను మాత్రం ఇదంతా లెక్క చెయ్యకుండా, అతి జాగర్తగా ఆ రాళ్ళని తీసి ఒకొక్కటే లెక్కపెడుతూ కూర్చున్నాడు.

నా కేమీ తోచక సూరయ్యవంక చూశాను. అత నింకా తల ఓరగానే పెట్టి లెక్కపెట్టబడుతూవున్న రాళ్ళను రెప్ప వెయ్య కుండా పరీక్షిస్తున్నాడు. ఇంతలో నా స్నేహితుడు లెక్క పూర్తి చేసి, "సరిపోయినయ్యి, సూరయ్యా" అన్నాడు.

"ఇవ్వాళ సరిపోయినై అంటే కాదోయి. ఇవ్వాళ ఇరవై. మళ్ళీ ఇరవై సోమవారం నాటికి నా డబ్బంతా దమ్మిడీల్తో ఇచ్చె య్యాలి," అని జ్ఞాపకం చేసి నా స్నేహితుడితో మూడుసార్లు

'ఇస్తాను' అనిపించుకొని వెళ్లిపోయాడు సూరయ్య.

అతడు ఎప్పుడు వెళ్తాడా, ఈ తంతేమిటో ఎప్పుడు తెలుసు కుందామా అని కూర్చున్న నేను, అడుగుదామని నా స్నేహితుని వైపుకి తిరిగేటప్పటికి, అతడు చేత్తో నన్ను వారించి వాకిలి వైపుకి చూపాడు. నేను అటు చూట్టం, సూరయ్య గభాలున తలుపునెట్టుకొని లోపలకు రావటం ఒకేసారి జరిగింది. మనిషి ఇదివరకుమల్లే లేడు. ఆపాదమస్తకం వొణికిపోతున్నాడు. కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా వున్నాయి. గాలి తెగ పీలుస్తున్నాడు. తల మాత్రం ఓరగానే వుంది.

ఒకక్షణం వాకిట్లో ఆగి రంయిన నాస్నేహితుడి మీదకు వచ్చి ఇలా కేకలు వేశాడు.—"ఏదీ నా డబ్బు? ఎన్నాళ్ళ యింది? ఇదిగో అదిగో అంటూ కుక్కని తిప్పుకున్నట్టు నీ యింటిచుట్టూ తిప్పుకుంటావా? పరువూ మర్యాదా ఉండక్కర్లా? కడుపుకి అన్నంతింటున్నావా, గడ్డితింటున్నావా?"

నిజంచెప్పొద్దూ ఈమాటలు వినేటప్పటికి నాకు కంపరం ఎత్తింది; కోపం వచ్చింది. కాని ఏమిచెయ్యటం? గుడ్లు వప్ప చెప్పి చూస్తూ కూర్చున్నాను.

నా స్నేహితుడు భయంగా, అతి వినయంగా, "ఇదిగో సూరయ్యా, నీ డబ్బు! నాలుగు రోజులు ఆలస్యమైనంత మాత్రాన నీ బోటి పెద్దమనిషి ఇట్లా నోరు పారేసుకోవటం ఏం మర్యాద?" అని తన దగ్గరేవున్న ఆ రాళ్ళమూటని ఇచ్చాడు.

"మరి వడ్డీయో? డబ్బు నాకు చేదై ఇచ్చాననుకున్నావా? నీ తాతకి అచ్చుండి ఇచ్చాననుకున్నావా? పూర్తి పరిష్కారం

చేసి కదులు," అని బొడ్లో చెయ్యేసి నిలవేశాడు సూరయ్య.

"ఇస్తాను సూరయ్యా, ఘురి వొదులు," అన్నాడు నా స్నేహితుడు.

"తీసుకురా" అని ఒక్క తోపు తోశాడు సూరయ్య.

నా స్నేహితుడు పడబోయి నిభాయించుకొని గోడపక్కకు వెళ్ళి, పదిరాళ్ళు ఏరితెచ్చి సూరయ్య చేతులో పెట్టాడు. సూరయ్య వాటిని లెక్కపెట్టుకొని, నా స్నేహితునితో ఒక్క మాటైనా అనకుండా గిరుక్కున వాకిలివైపుకు తిరిగి తల ఓరగానే వుంచుకొని గబగబా నడిచి వెళ్ళిపోయాడు.

నా స్నేహితుడు ఒక్క నిట్టూర్పువిడిచి నేను అడగవలసిన అవసరం లేకుండా తానే ఇలా చెప్పాడు—"పాపం ఏం చెప్పను? ఒకప్పుడు ఈ వూళ్లోకల్లా షాహుకారు ఈ సూరయ్య. ఇప్పుడు పిచ్చెక్కి ఈవిధంగా తయారయ్యాడు," అన్నాడు.

"ఇతనికిపిచ్చా! ఎందుకెత్తింది? పిచ్చిలో ఇదేమిటి?" అని అడిగాను.

నా స్నేహితుడు సూరయ్య కథ ఈ విధంగా చెప్పాడు.

"సూరయ్య ఈగతికి రావటానికి అతని తండ్రే కారణం. అతని తండ్రి చాలా మంచివాడు. మెత్తని హృదయం కలవాడు. అటువంటి ఆతడే, కొడుకు పతనానికి కారకుడయ్యాడు."

"అంత మంచివాడు......"

"చెప్తాను విను. అంత మంచివాడు అవటంవల్లే దానాలు చేసీ, అడ్డాలు వుండీ తన ఆస్తంతా పాడుచేశాడు. ఆస్తిపోయిం తర్వాత పలకరించే దిక్కులేకుండా చచ్చిపోయాడు. ఇది కన్నులారా చూచిన సూరయ్యకు సంఘంమీద కసి ఏర్పట్టంలో

ఆశ్చర్యం లేదు. అందుకని పూర్తిగా తన స్వభావాన్నే మార్చుకొని, పెత్తనానికి వొచ్చి నప్పటినుంచీ కఠోరంగా సంపాదించటం మొదలు పెట్టాడు. వున్న నాలుగు ఎకరాలూ అమ్మేసి వడ్డీవ్యాపారం మొదలు పెట్టాడు. మనుష్యుల్తో వున్న ఇతరత్రా సంబంధాలన్నీ క్రూరంగా తెగ్గొట్టుకున్నాడు. తనకీ మిగిలిన మనుష్యులకీ ఒకటే సంబంధం—వడ్డీవ్యాపారం. తాను వడ్డీకి డబ్బు ఇవ్వటానికి పుట్టాడు. మిగిలిన జనం డబ్బు పుచ్చుకొని వడ్డీ ఇచ్చుకోటానికి పుట్టింది.

ఇట్లా తయారై, మిగిలిన రైతుల్ని పీల్చి పిప్పిచేసి కొద్ది సంవత్సరాల్లోనే వూళ్లోకల్లా షాహుకారై కూర్చున్నాడు. కాని ఎంత షాహుకారైనా డబ్బు సంపాదించటం అలవాటైంతర్వాత పద్ధతులు ఎలా మారతై—కనక డబ్బు అవసరం లేనప్పటికీ కూడా పాతపద్ధతులమీదే నడిచాడు. పిల్లికి బిచ్చం పెట్టేవాడు కాదు. ఎడిలి గీపెట్టినా దమ్మిడీ జారనిచ్చేవాడు కాదు. బాకీ దార్లని ఎన్ని కష్టాలు పెట్టాలో అన్నీపెట్టి ఇన్ని నీళ్లుకూడా పుట్టకుండా చేసి తన డబ్బు పిండుకునేవాడు. ఆ పిండు కోవటంలో కూడా దయా దాక్షిణ్యాల్లేవు. కొంపలు కూలినా, కుటుంబాలు నాశనమైనా అతని హృదయం కరిగేది కాదు.

అందుకని అతని డబ్బుతోపాటు, అతని మీద వూళ్ళో అసూయా అసహ్యంకూడా పెరుగుతూ వచ్చినై. అతన్ని చూస్తే భయమే తప్ప ఇష్టం ఒకట్టి వ్యక్తికూడా లేకుండాపోయింది. సూరయ్య ఇది కూడా మంచిదే అనుకున్నాడు. నా కాకవల సింది డబ్బు-వీళ్ళ ఇష్టం ఎవరికాకవాలి ? అంటూవుండే వాడు. పరిస్థితులు ఇట్లా వుండగా ఒక సంఘటన జరిగింది.

ఈ వూళ్ళోనే అవతలి వీధిలో చంద్రయ్యా అనే రైతు వున్నాడు. చంద్రయ్యా ఈ సూరయ్యాకి రెండు వందల రూపాయల బాకీ ఇవ్వాతేలాడు. చంద్రయ్యా అవటం చిన్నరైతే ఐనా ఊాన్తో సంబంధం వున్న వాడవటంవల్ల, డబ్బన్నా కోర్టన్నా లెక్క లేకుండా వుండేవాడు. డబ్బున్న వాళ్ళంటే అసహ్యం వుండీ భయం లేదు. తనకు అవసరానికి డబ్బిచ్చాడనే విశ్వాసం లేకపోగా తన దగ్గర సూరయ్యా అన్యాయంగా డబ్బు దోచుకుంటున్నాడనే భావం, కోపం కలిగినవాడు. సూరయ్యా హెచ్చు వడ్డీ వస్తుందని అతనికి అప్పు పెట్టాడే గాని, పెట్టిం దగ్గర్నించీ డబ్బు రాదేమో అనే భయంతో అతని ఇంటి చుట్టూ తిరగటం మొదలు పెట్టాడు. ఒకరోజు చంద్రయ్యాని నా డబ్బిచ్చి కదలమని నిలవేశాడు. నానా దుర్భాషలూ ఆడాడు. దాన్తో లోలోపల రగులుకుంటున్న అగ్ని చంద్రయ్యాలో నుంచి గుప్పున బయటపడింది— "నేను దమ్మిడీ ఇవ్వను. నీ తాత్తో చెప్పుకో! ముందు గడపలో నుంచి అవతలకు వెళ్ళు," అని కేకలు వేశాడు.

పాపం సూరయ్యాకు ఇట్లాంటి అనుభవం ఇదివర కెప్పుడూ కలగ లేదేమో, చంద్రయ్యా మాటలకు నిరుత్తరుడై ఒక్క నిమిషం మాట్లాడ లేకపోయాడు.

"వెళ్ళవ్!" అని గద్దించాడు చంద్రయ్యా. "చంద్రయ్యా! ఇది నీకు మంచిది కాదు. కోర్టుకులాగి పప్పు తీయిస్తాను," అన్నాడు సూరయ్యా.

"పప్పు తీయిస్తావట్రా మాదచోఛ్ద్" అని నానా బూతులూ కూసి మెడమీద కఱ్ఱవేసి బయటకు గెంటాడు చంద్రయ్యా.

ఇక చూడు సూరయ్యా సంగతి. సూరయ్యాకు శివం ఎత్తింది.

పిచ్చి గంగిరెల్లెత్తినై. కనపడ్డవాడికల్లా చెప్పాడు. "ధర్మవడ్డీ - ధర్మవడ్డీకూడా ఇవ్వడట! అసలే ఇవ్వడట! ఇదెక్కడన్నా వుందా? రాములవారి కాలం నుంచీ ఈ వడ్డీ వుందిగదా!" అని మొత్తుకున్నాడు.

తిరిగి తిరిగి ఇంటికివెళ్ళి గబగబా నాలుగు మెతుకులు నోట్లో వేసుకొని, అంగోస్త్రం నడుంకి కట్టి, తెల్లగుడ్డ గొడుగు చంకన పెట్టి టౌన్‌కి బయల్దేరాడు. అప్పటికీ ఆశ చావక, చంద్రయ్య వాకిలి ముందు సకిలిస్తూ నాలుగైదుసార్లు అటూ ఇటూ పచారు చేసాడు. బజార్న పోతున్నవారిని నిర్నిమిత్తంగా పిలిచి, "కొంచం కోర్టులో పనివుండి టౌన్‌కి వెల్తున్నాను," అని ఇంట్లో వున్న చంద్రయ్యకు వినబడేటట్టు చెప్పాడు. చంద్రయ్య, "కోర్టు కాక్కదా. నిన్ను పుట్టించిన బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్లు. ఈ వూరు నీళ్లు నీకు ప్రాప్తం లేదు," అని ఇంట్లో నుంచే కేక వేశాడు.

ఇకేం చేస్తాడు? ఇక తప్పేదేముంది? చంద్రయ్య మాటలకు మనస్సులో కొంచం జంకినా డబ్బెలా వొదులుకోవటం? మనస్సుని తిట్టి లోబరచుకొని టౌన్‌కి వెళ్ళి ప్లీడరుతో మాట్లాడి చంద్రయ్యకు రిజిష్టరీ నోటీసు ఇప్పించాడు. నోటీసైతే ఇప్పించాడేగాని మనస్సులో ఆరాటం హెచ్చింది. దిగులు దిగులుగా వుండి ఏమీ తోచక టౌన్లో అటూ ఇటూ తారట్లాడి ఇంటికి బయల్దేరే టప్పటికి మసకపడ్డది. టౌన్ నుంచి మా వూర్రావాలంటే రోడ్డు దిగి డొంకలో మైలు నడవాలని నీకు తెలుసు. సూరయ్య డొంక దగ్గరకు వచ్చేటప్పటికి బాగా చీకటి పడ్డది. రోడ్డు దిగేటప్పటికి అతనికి భయం వేసింది ఆ డొంక మా

ఒక్క వూరికి వచ్చేదే అవటంవల్ల మనుష్యసంచారం తక్కువగా వుంటుంది. పైగా రెండు పక్కలా కొండవిదయ్యాలు తలలు విరబోసుకున్నట్లు కనబడే, గుబురుగా పెరిగిన చెట్లూ. సూరయ్య ధైర్యంచేసి ఆంజనేయ దండకం పఠిస్తూ చీకటిలో పడి గబాలు నడిచాడు. ఆ పెద్దమర్రిచెట్టు చూశావుగా అక్కడకు వొచ్చాడు. అకస్మాత్తుగా పక్క పొదల్లో అలికిడి వినిపించి ఆగిపోయాడు. గొంతులో పాట గొంతులోనే ఆగిపోయింది. వెంటనే అతని కోసం పొదల్లో కనిపెట్టుకూచున్న చంద్రయ్య ముఠా పడింది అతన్ని కమ్ముకున్నారు- మీదకు దూకారు. చావచితగ కొట్టారు. పాపం కింద పడేసి సున్నం మీద యముక లేకుండా కొట్టారు. చంద్రయ్య మీదపడి అతని జేబులో వున్న ఇరవై రూపాయలూ లాక్కొని, "దావా దాఖలుచేశావుగా! కోర్టుకేసు పెట్టుకుంటావు నీ తాత?" అని కాలికి వొచ్చినట్టు తన్ని, మిగిలిన వాళ్లని తీసుకొని, సూరయ్యని అక్కడే వొదిలి వెళ్ళిపోయాడు.

క్షణాలమీద ఈ వార్త వూరంతా పాకింది. "సూరయ్యని కొట్టారంటే సూరయ్యని కొట్టా"రని వూరంతా ఆ గుబ్బగా చెప్పుకుంది. కాని ఒక్కడుకూడా జాలి తలిచినవాడే లేడు. 'పాపం' అన్న పాపాన పోయినవాడే లేడు.

సూరయ్య భార్యా, కూతురూ మాత్రం భోరున ఏడ్చారు. సూరయ్య భార్య దొడ్డ ఇల్లాలు. కూతురుకూడా చాలా మంచిది. కాని బయట జరిగే దురంతాలను వాళ్లెలా ఆపగలరు? సూరయ్య మనస్సుని ఎలా తిప్పగలరు?

తెల్లకి తెల్లవారింతర్వాత వూళ్ళో షాహుకార్లు సూరయ్యని

పరామర్శించటానికి వొచ్చారు. సూరయ్యకు ఆ రాత్రంతా నిద్ర లేదు. ఏదో ఆలోచించుకుంటూ కూర్చున్నాడు. భార్యా కూతురూ నోటికి మూత లేకుండా ఏడుస్తున్నా, వాళ్ల వంక కే చూట్టం లేదు. అన్ని దెబ్బలు తిన్నా ఒక్క మూలుగన్నా మూలగటం లేదు.

షావుకార్లు వొచ్చి, "సూరయ్యా! ఇక చూస్తూ వూరు కుంటే లాభం లేదు. క్రిమినల్ కేసు బనాయించి వాళ్ళఅంతు కనుక్కోవలసిందే !" అన్నారు.

సూరయ్య ఏమీ మాట్లాడలేదు. ఏదో ఆలోచించుకుంటూ పడుకున్నాడు. అతని మౌనాన్ని షావుకార్లు అపార్థం చేసు కొని, "కాదు సూరయ్యా, మనం తప్పక గెలుస్తాం. అనుమానం లేదు..." అన్నారు.

సూరయ్య కొంచెం కదిలి, వాళ్లని నింపాదిగాచూచి, "ఇంకేం? అందరం చందాలు వేసుకొని వ్యాజ్యమాడదాం," అన్నాడు.

'చందాలు' అనేటప్పటికి షావుకార్లు మొహా మొహాలు చూసుకున్నారు. "అదేమిటి సూరయ్యా, నిన్ను కొట్టట మేమిటి? మేం చందాలు వేసుకోవట మేమిటి?" అన్నారు.

ఈ మాటలకు సూరయ్యకు కోపం వొచ్చింది. అంత బాధలోనూ లేచి కూర్చొని, "వాళ్ళు నన్ను కొట్టారా? నా దగ్గర వున్న డబ్బుని కొట్టారు. అంటే ఈ వూళ్ళోవున్న షావు కార్లందర్నీ కొట్టారు. వడ్డీకోసం అప్పుపెట్టే ప్రతివాడ్నీ కొట్టారు. నన్ను కొట్టటమైతే ఒక్క చంద్రయ్యే కొట్టేవాడు. మిగిలిన వాళ్లంతా ఎందుకు కుమ్మక్కు చేస్తారు? వాళ్ళు

కొట్టగలరు గనక అంతా కలిసి కొట్టారు. మనం చందాలు వేసుకోగలం గనక అంతా కలిసి చందాలు వేసుకుందాం," అన్నారు.

షావుకార్లకు ఇదేమీ అర్థం కాలేదు. దెబ్బల్తో సూరయ్య మతి చెడ్డది అనుకున్నారు. నెమ్మదిగా ఒకరి తర్వాత ఒకరు జారుకున్నారు.

ఎంతమంది చెప్పినా, ఎంత చెప్పినా సూరయ్య వినలేదు—కేసు పెట్టనంటే పెట్టనన్నాడు. "నా సొంతడబ్బు తగలేసుకొని, ఈ డబ్బున్న వాళ్లకోసం వ్యాజ్యం ఆడిపెట్టనా? నే చెయ్యను," అనేవాడు.

కాని చంద్రయ్య ఏ ముహూర్తాన చెయ్యి చేసుకున్నాడో గాని, అప్పటినుంచీ సూరయ్య దశ తిరిగి పోయింది. దెబ్బలుతిని కేసు పెట్టకపోయేటప్పటికి వూళ్ళోవాళ్ళకి లొల్లి అయిపోయారు. తాము ఏడబ్బుని చూచి భయపడుతున్నారో, ఆడబ్బు సమయానికి సూరయ్యని అదుకోలేకపోయేటప్పటికి ఇంకేముంది? పెద్దలు మొదలు కుర్రవాళ్ళవరకూ సూరయ్యని ఆటలు పట్టించటం మొదలు పెట్టారు. ఇల్లు కదిల్తే చాలు — "సూరయ్య వడ్డీ చంద్రయ్య లాఠీ" అని పిల్లలు చప్పట్లు కొట్టుకుంటూ వెంటపడేవారు. రావలసిన డబ్బు అడిగితే బాకీదార్లు "ఏం, తన్నులు కావాలా?" అనేవారు. కొందరు 'ఇదిగో అసలు, ఇదిగో వడ్డీ' అని మొట్టికాయలు వేసేవారు కూడాను.

చివరకు సూరయ్యకు చిల్లిగవ్వ కూడా వసూలు కాకుండా పోయింది. ఎట్లా వచ్చిన డబ్బు అట్లాగే పోయింది. ఎక్కడ పెట్టిన డబ్బు అక్కడే యింకిపోయింది. తనకు తదనంతరమైనా వస్తుందనుకున్న ఆస్తి రాకుండా పోయిందని అల్లుడు కూతుర్ని ఇంట్లో

...ర్యా మొహం, కూతురు మొహం చూడలేక ...సంసారం వరకు ఇంటికి వుంచకుండా తిరుగుతూ కాలం గడిపే ... నాలుగు మెతుకులు నోట్లో వేసుకొచ్చి చెరువుగట్టు మీద రావిచెట్టుక్రింద ఒంటరిగా కూర్చునేవాడు. ఇన్ని రాళ్లు ఏరుకొని ఒక్కొక్కటీ చెర్లో వేస్తూ, అవి నీళ్లల్లో పుట్టించే కదలికను పరీక్షిస్తూ, కూర్చునేవాడు.

కాని వూళ్ళో జనం అక్కడా అతన్ని సుఖంగా వుండనివ్వలేదు. అతను నిస్సహాయుడౌతున్నకొద్దీ జనం తన బలాన్ని ఎక్కువగా ఉపయోగించటం మొదలుపెట్టింది. జనానికి అతని మీద కలిగిన కసి, అలుసూ అతన్తోనే ఆక్క అతని కుటుంబం మీదకు తిరిగింది.

ఒకరోజు సూరయ్య కూతురు వాముల దొడ్లో గేదెకు మేత వేస్తుంటే నలుగురు పట్టుకొని గాతంలో పడేసి బలాత్కారంగా చెరిచారు. వాళ్లు విడిచిపెట్టి వెళ్ళింతర్వాత ఆపిల్ల లేచి, నడవలేక కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి, బావిలో పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంగతి తెలిసి సూరయ్యభార్య, అవమానాలు సహించలేక కిరసనాయిలు పోసుకొని కాల్చుకొని మరణించింది. అదే సమయంలో విరోధులు సూరయ్య ఇవ్వవలసిన బాకీలు తమ పేర ట్రాన్స్ఫర్ చేయించుకొని ఇల్లు వేలం వేయించారు..."

ఇంతవరకు ఓపికతో విని, ఇక ఆపుకోలేక నేను ఈ ప్రశ్న వేశాను—"ఈ ఘోర కృత్యాల్ని జరక్కుండా ఎవ్వరూ ఆపలేదూ?"

"తప్పన్నవాళ్ళే లేరు. చేసుకున్నది అనుభవిస్తున్నాడని

కొందరూ, ఈ ఉద్రేకంలో అప్పు చెపితే తమ కుటుంబాలు సరిగ్గా ఉండవేమో ఆ నేభయంతో కొందరూ—మొత్తానికి అంతా మెదలకుండా వూరుకున్నారు."

"ఊఁ! తరవాత ఏం జరిగింది?" అని అడిగాను.

"ఇకే ముంది? డబ్బుదారిన డబ్బు నడిచింది కూతురు అలా అయిపోయింది. భార్య ఇలా అయిపోయింది. సూరయ్య గుండెలు పగిలిపోయినై. ఆవులాగా అడలుతూ, వూరుపట్టుక తిరిగేవాడు. కొన్నాళ్ళకు పిచ్చెత్తింది. ఇప్పు డెవరన్నా జాలి తలిచి ఇన్ని మెతుకులు పెడితే తింటాడు. ఆ చెఱువు గట్టుమీది రావిచెట్టు కిందేవుంటాడు. ఎండలో వానలో అక్కడే వుంటాడు. ఎప్పుడూ కూతురు సంగతిగానీ, భార్యా సంగతిగానీ ఎత్తడు. ఎవర్నీ పలకరించడు. రోజు కొకసారి వెళ్ళి తన పాతఇంటిని దూరా న్నుంచి చూచుకొని కన్నీరు పెట్టుకుంటూ వుంటాడనీ, రాత్రిళ్ళు తన కూతురు పడి ఆత్మహత్య చేసుకున్న బావి దగ్గరకువెళ్ళి ప్రదక్షిణంచేసి వస్తూవుంటాడనీ వూళ్లో చెప్పుకుంటూ వుంటారు...ఇదీ సమాచారం..."

నేను కథంతా ప్రాణాలు బిగబట్టుకొని విన్నాను. సూరయ్య కథ చెప్పమన్నప్పుడు ఇటువంటి విషాదగాథ వింటానికి సిద్ధపడ లేదు గనక చాలా ఖేదపడ్డాను. "మరి ఈ రాళ్ల వ్యవహార మేమిటి?" అని అడిగాను.

"అలవాటు" అన్నాడు నా స్నేహితుడు. "పాత అలవా టుని పట్టి ఇలా చేస్తూవుంటాడు. మేం కూడా జాలిపడి అతని మనస్సుని ఈ అవస్థలో కష్టపెట్టటం ఎందుకని తగువిధంగా ప్రవ రిస్తూ వుంటాం. ఈ సూరయ్య..."

[illegible] వెలుగులోవుండగానే వీధిలో పెద్దగోల బయ
'సూరయ్య [illegible], చంద్రయ్య లాక్,' అని కేకలు.
[illegible] సూరయ్యా 'శ' అని అడిలాడు. ఆ ధ్వని
[illegible]

[illegible] సూరయ్య [illegible]కుంటూ, రొప్పుకుంటూ [illegible] వస్తూ [illegible]న్నాడు. చేతుల్లో నా స్నేహితుడిచ్చిన మూట భద్రంగా వుంది. వెనక పదిమంది పిల్లలు పోగై గోల చేసుకుంటూ సూరయ్యా మీదకు రాళ్ళు విసురుతున్నారు.

నడుస్తూ నడుస్తూ వున్న సూరయ్యా అకస్మాత్తుగా పరిగెత్తటం మొదలు పెట్టాడు. కొంత పరిగెత్తి ఒక ఇంటిముందు ఆగి, ఒక్క నిమిషం ఆయింటిని చూచి, అక్కడనుంచి కదిలి పక్కనే వున్న బావిగట్టుమీద నిలబడ్డాడు. పిల్లలంతా ఎక్కడి వాళ్లు అక్కడే ఆగిపోయారు. చేతుల్లో రాళ్లు చేతుల్లోనే వున్నాయి. నేనూ నా స్నేహితుడూ వూపిరి బిగబట్టిచూస్తూ నుంచున్నాం. సూరయ్యా వంగి బావిలోకి చూచి లేచి, ఇంటివైపుకి చూశాడు. ఉండి ఉండి 'శే' అని సైరిక లాగా, విన్న వాళ్లకి సలపరం పుట్టేటట్టు అడిలి రాళ్లమూటతో సహా బావిలోకి దూకాడు.

వాళ్ళూ వీళ్ళూ పోగయ్యారు గాని ఏమీ లాభం లేక పోయింది. నా స్నేహితు డిచ్చిన రాళ్లమూట తేలనివ్వక పోయింది. శవం బయటికి వచ్చింది. తర్వాత - మేం ఇంటికి వచ్చిం తర్వాత - నా స్నేహితుడు ఇలా చెప్పాడు—"ఆ ఎదురుగా వున్న ఇల్లే అతని ఇల్లు. అతను దూకినబావే అతని కూతురు ఆత్మహత్య చేసుకున్న బావి."

భయం

గోపీ అప్పుడే రైలుదిగాడు. అతని తల్లి చనిపోయి ఎక్కువ రోజులు కాలేదు. చనిపోయేముందు "తమ్ముళ్లున్నారు బాబూ!" "చెల్లెలికి ఎటువంటి సంబంధం తెస్తావో?" అని తల్లి చెప్పిన మాటలు ఇంకా చెవుల్లో గింగురు మంటూనే వున్నై.

అమ్మ పోయిన్నాటి రాత్రి, అంతా గొల్లున ఏడుస్తుంటే, "ఏంచు కన్నయ్యా!" అని అడిగాడు పెద్దతమ్ముడు.

"వాళ్లకు పిచ్చెత్తింది, వాళ్ళెప్పుడూ అంతే," అని చెప్పాడు గోపి.

గోపీ పెద్దతమ్ముడు చిన్నతమ్ముణ్ని అడిగాడు-"అమ్మేదిరా?"

వాడు ఆకాశంవైపు చూపించాడు. అందులో గోపీకి వేదాంతం కనిపించింది. అమ్మ చచ్చిపోలేదు. చచ్చిపోయింది మనం. ఈలోకమంతా చచ్చిపోయింది. ఈ చచ్చిన లోకంలోనుంచి అమ్మ బతికింది.

కాని ఆ రాత్రి మాత్రం గోపీకి ప్రపంచం ఎడారిగా, శూన్యంగా, వల్లకాడుగా, భయంకరంగా కనిపించింది.

ఇవన్నీ జ్ఞాపకంవచ్చి, ఎరిగినవాళ్ళుగానీ, స్నేహితులుగానీ కనిపించి "మీ అమ్మకు ఎట్లా వుంది?" అని అడుగుతారేమో నని భయంవేసింది గోపీకి.

"కూలీ?" అని పిలిచాడు.

"బాబూ"

"పెట్టె తీసుకురా"

"ఎక్కడకు బాబూ?"

పేట పేరు చెప్పాడు గోపి.

"అణా బాబూ"

"బేడ ఇస్తా, నాతో రా."

పెట్టె కూలివాడి నెత్తిమీదపెట్టి పరధ్యానంగా బయల్దేరాడు గోపి. కూలీ గోపీ వెనక అడుగుల్లో అడుగులు వేసుకుంటూ వెల్తున్నాడు.

వర్షంకురవటానికి ప్రయత్నిస్తూవుంది. సూర్యుడు నాశనమైన చీకట్లో నక్షత్రాలు మెరుస్తున్నయి. గోపీ కూలీ పిల్లవాడితో సంభాషణ మొదలుపెట్టాడు:—

"రోజుకి ఎంతొస్తుందిరా?"

"అర్థణో, అణో వొస్తుందండీ!"

"దాన్తో ఏం చేస్తావ్?"

"కొనుక్కు తింటాను."

"ఇంటిదగ్గర ఇవ్వవూ?"

"నాకు అమ్మాబాబూ లేరండీ! ఉంటే అట్లాగే ఇచ్చేవాణ్ణి."

"మరి నీకు పొట్ట ఎలాగురా గడవటం?"

"ఇక్కడ ఒక పోర్టరుకాడ వుంటున్నానండీ. ఆయన ఇంట్లో పనిచేసి పెడతాను. అన్నం పెడతారు. రైలొచ్చినప్పుడు ఇట్లా కూలి మోస్తుంటాను. ఏ అణో వొస్తే కొనుక్కు తింటాను. రాత్రిపూట రైలుస్టేషన్లోనే పడుకుంటానండీ..."

"ఎంత హాయి బ్రతుకురా," అనుకున్నాడు గోపి. కాని అప్పట్నుంచీ ఆపిల్లవాణ్ణి చూస్తే గోపీకి భయం.

ఇలా జరిగేను!

అది రెండో సంవత్సరం—

గత సంవత్సరమంతా యశోధరుడు ఆ పల్లెలోనే వుండి పార్టీపనిచేశాడు. రాత్రింబగళ్ళు నిద్రా నీళ్లూ లేకుండా పని చేశాడు. వ్యవసాయకూలీలను గురించి బండెడు పుస్తకాలు చదివాడు. వాళ్లల్లో చైతన్య రహితంగా పడివున్న శక్తిని గ్రహించాడు. వాళ్ళ హక్కులను తెలుసుకున్నాడు. రైతులు వాళ్ళ నేవిధంగా పీడిస్తూ వుందీ—అతని భాషలో రక్తం తాగటం—అర్థం చేసుకున్నాడు. ఇవన్నీ వాళ్లకి చెప్పాడు.

"పనిచేసేది మీరు: ఫలితం అనుభవించేది వారు" అన్నాడు.

ఎవరా అని వ్యవసాయకూలీలు అటూ ఇటూ చూశారు.

"రోజుకి గుప్పెడు మెతుకులేకుండా మీరెంతకాలం ఇలా బ్రతుకుతారు ?" అని ప్రశ్నించాడు. వ్యవసాయకూలీలు తమ తమ కుండలు సర్దుకున్నారు. ఆరబోసిన బెత్తల్నీ, కుప్పలు కుప్పలుగా వున్న పీతల్నీ, వేలాడకట్టివున్న చీకుల్నీ చూచుకొని గుటకలు మింగారు.

"మీ శక్తి మీకు తెలియదు. మీరు ఏకంగా ఒక్కపెట్టున లేస్తే రాజ్యాలే మీచేతుల్లోకి వస్తయ్," అన్నాడు యశోధరుడు.

వాళ్ళు ఒకళ్ళ చేతులు ఒకళ్ళు చూచుకున్నారు. ఎవరి చేతులు వాళ్లు దులుపుకున్నారు.

ఈవిధంగా అతడు సంవత్సరం తంటాలుపడ్డాడు. సంవత్సరం తిరిగివచ్చేటప్పటికి అతని కృషికి ఫలితాలు గోచరించినయ్. వ్యవసాయ కూలీల్లో విప్లవచిహ్నాలు రేకెత్తినయ్. ఎక్కడ

చూచినా 'కూలీ లందరు ఏకము కావలెరా' అనే కీర్తనే విన బడుతూ వుంది—ప్రతిదానికీ యశోధరుని సలహా తీసుకోవటం మొదలుపెట్టారు. క్షణక్షణానికీ పల్లె అంతా మారిపోతున్నట్లు ఊహించుకున్నాడు. తన కృషి నేటికి ఫలించిందికదా అని సం తోషించాడు యశోధరుడు. ఈ వేడిలోనే జయం పొందాలను కున్నాడు. వ్యవసాయకూలీలు 'సై' అన్నారు.

"పదండి పోదాం, పదండి ముందుకు," అన్నాడు వెంకాయ. పల్లె పల్లె బిలబిలా బయల్దేరింది. పిల్లలు పెద్దలు అంతా బయ ల్దేరారు. షావుకారు బసవయ్య ఇల్లు చుట్టుముట్టారు.

షావుకారు బసవయ్య వెంకాయిదొర. ఆవూళ్ళో రైతు లందర్లోకీ డబ్బున్నవాడు. ఆ ఇంటిదగ్గరకు జేరినప్పటినుంచీ, మిగిలినవాళ్ళు కేకలు వేస్తున్నా వెంకాయి కొంచం బెరుగ్గా వుంటం మొదలుపెట్టాడు.

"తలుపు తలుపు" అని కేకవేసింది జనం.

కాని తలుపు అలాగే మూసుకొని వుంది. వ్యవసాయ కూలీ లకు ఏం చెయ్యటానికీ తోచలేదు. అయిదు నిమిషాలయింది— పది నిమిషాలయింది—పావుగంట అయింది. తలుపు అలాగే వుంది. వ్యవసాయకూలీలు ముగ్గురు నలుగురు చొప్పున ఒక్కొక్క చోట జేరి కబుర్లు చెప్పుకోవటం మొదలు పెట్టారు. యశోధరుడికి చిరాకువేసింది. ఉపన్యాసం మొదలుపెట్టాడు.

"కామ్రేడ్స్"—

ఇంతలో తలుపు తెరుచుకుంది. బసవయ్య బయటకు వచ్చాడు. అతని వేలు పట్టుకొని మూడేళ్ళ కూతురొచ్చింది. భార్య అన్నపూర్ణ తలుపు పక్కనుంచి తొంగి చూస్తూ వుంది.

ఉపన్యాసకుణ్ణి వొదిలి వ్యవసాయ కూలీలంతా వొక్కసారి బసవయ్యవైపుకి తిరిగారు. కూర్చున్నవాళ్ళంతా వొక్కసారి లేచి నిలబడ్డారు. తరువాత ఏం చెయ్యాలో తోచలేదు. అలాగే చూస్తూ నుంచున్నారు.

బసవయ్య మూడేళ్ళ కూతురు గుంపులోవున్న వెంకాయిని గుర్తుపట్టింది. సంతోషంగా "అలుగో, ఎంకు, ఎంకు, ఎంకు," అని బుల్లిచేతుల్తో చప్పట్లు కొడుతూ గంతులేసింది.

వెంకాయి సిగ్గుతో తలవంచుకొని, "మా చిన్నదొరసాని, మా చిన్నదొరసాని" అని పక్కనున్న వాళ్ళకి చెప్పాడు.

"వెంకా ?" అని పిలిచాడు బసవయ్య,

వెంకాయి వులిక్కిపడ్డాడు. "ఎళ్ళరా, పెద్దదొర పిలుస్తున్నాడు," అని అంతా వెంకాయిని ముందుకు నెట్టారు.

"ఏరా ఎంకా బాగున్నావా ?" అన్నాడు బసవయ్య. ఆ మాటలు వెంకాయి హృదయాన్ని కరిగించినయ్. ఎన్నడో విడిచిన తండ్రిని చూచినట్లు ఆనందించాడు. ముసిముసినవ్వులు నవ్వుకుంటూ నిలబడ్డాడు.

"ఎందుకురా, ఇంతమందొచ్చారు ? ఏమన్నా పనుందా ?" అని అడిగాడు బసవయ్య.

"ఏం లేద్దొరా," అని సణిగాడు వెంకాయ.

"చెప్పు. దొరతో చెప్పుకోరా ! మనవిచేసుకోరా," అని కొంతమంది కేకలు వేశారు.

వెంకాయి, తప్పక ధైర్యం చేశాడు—"ఏంలేద్దొరా ! మా కొకటి కావాలి."

"ఏమిటి చెప్పు ?"

"నూతన వెవస్త"

"ఏమిటీ?"

"నూతన వెవస్త దొరా"

బసవయ్య కొంచంసేపు ఆలోచించాడు. కాని అర్థం కాలేదు—"అది నాదగ్గర లేదు," అన్నాడు.

"చూడు దొరా" అని ప్రాధేయపట్టానికి రెండడుగులు ముందుకు వేశాడు వెంకాయి.

"నా దగ్గర లేదురా, పోయి మన జమీందారు దగ్గరుందేమో అడుగు," అన్నాడు బసవయ్య.

"అవును. ఆయనద్దగ్గరే దొరుకుద్ది. ఆక్కడే దొరుకుద్ది," అని మిగిలినవాళ్ళు కేకలు వేశారు. యశోధరుడు ఉక్కిరి బిక్కిరై పోయాడు. ఏం చెయ్యాలో బోధపడలేదు. ఎలా జోక్యం కలిగించుకోవాలో తెలియలేదు. జోక్యం కలిగించుకుంటే ముందీ వ్యవసాయకూలీలు వూరుకుంటారా? అనే స్థితి కొచ్చింది.

వెంకాయి మళ్ళీ బసవయ్య నడిగాడు—"ఇంకొకటి దొరా!"

"ఏమిటి?"

"కూలీలంతా ఏకం కావాలి దొరా."

"ఎందుకు?"

"కావాలి దొరా!"

"ఎందుకురా, కారణం చెప్పు"

"కారణం ఏంటి దొరా! ఏకం కావాలి".

"సరే అవ్వండి."

"అదేంటి దొరా, అలా సెలవిత్తావ్?. దొర సాయం లేకుండా మేం ఎట్లా ఏకం అవుతాం?."

"సరే అట్లాగే అవ్వదురుగాని. మరి మమ్మేళ్నేం చెయ్యమంటావు?" అన్నాడు బసవయ్య.

"మీరా...దొరలా...దొరలా......" అంటూ నసికాడు వెంకాయి.

"నిజమేరా, దొరల్నిడిచి మనం ఎక్కడికి పోతాం—" అన్నారు కొందరు.

"నువ్వడిగింది బాగుంది దొరా!" అన్నాడు వెంకాయి.

"అందుకని మనం అంతా ఏక మవుదాం," అన్నాడొక వ్యవసాయ కూలీ.

"ఏక మవుదాం, ఏకమవుదాం" అని మిగిలిన కూలీల్లోనుంచి కేకలు. వెంకాయి సంతోషం చెప్పటానికి వీల్లేదు. ఆమాంతంగా బసవయ్య మూడేళ్ల కూతుర్ని ఎత్తుకొని—

"మా చిన్ని దొరసాని
మా చిట్టి దొరసాని
మా బుల్లి దొరసాని
ఏకమవుదాం
ఏకమవుదాం
ఏకమవుదాం—" అని గంతు లేశాడు.

"అంతా జమీందారు మీదకు పోదాం. నూతన వెవస్త తెచ్చుకుందాం. దొరలుంటే మనకేం భయం," అని వ్యవసాయ కూలీలంతా కేకలు.

"ఇక మీ పనుల్లోకి మీరు పొండి," అన్నాడు బసవయ్య. వెంకాయితప్ప అంతా సంతోషంగా గుసగుసలాడుకుంటూ వెళ్ళారు.

"దొరంటే పెద్దదొరని చెప్పుకోవాల్రా," అన్నా డొకడు.
"కష్ట సుఖాలు తెలిసిన మారాజు," అన్నాడు ఇంకొకడు.
"అడిగినయ్యన్నీ వొప్పుకున్నాడ్రా," అన్నాడు మరొకడు.

అన్నపూర్ణమ్మ అప్పుడు బయటకువచ్చి, "వెంకా! వెళ్ళే ముందు గేదెముందు ఇంత గడ్డివేసి పో! మజ్జిగ వున్నయ్, పోయించుకుపో," అంది.

"అట్లాగే దొరసానమ్మా" అని దొడ్లోకి పరుగెత్తాడు వెంకాయి.

వెంకాయిని చూచి గేదె 'బే' అని అడిలింది.

యశోధరుడు ఒకక్షణం తన్ను తాను నమ్మలేకుండా అలాగే నిలబడిపోయాడు. శూన్యం—శూన్యం—శూన్యం—జేబులోనుంచి అచ్చుపుస్తకం తీశాడు. గబగబా పేజీలు తిరగ వేశాడు. అప్రయత్నంగా ఈ వాక్యం అతని కంట బడింది. "ప్రజాస్వామిక విప్లవంలో వ్యవసాయకూలీలూ రైతులూ కలిసి పోట్లాడాలి."

"ఇది ప్రజాస్వామిక విప్లవమా?" అనుకున్నాడు. అటూ ఇటూ చూశాడు. కాని అప్పటికే ఎవ్వరిదారిన వాళ్ళు వెళ్ళారు. వ్యవసాయకూలీలు ఎవ్వరి పనుల్లోకి వాళ్ళు వెళ్ళారు. బస వయ్య భార్యనీ కూతుర్నీ తీసుకొని ఇంట్లోకివెళ్ళి తలుపు వేసుకున్నాడు.

యశోధరుడికి మిగిలింది శూన్యమే!

యువ ప్రచురణాలు

హాహా హూహూ	(నవల)	విశ్వనాథ	0-8-0
తిరుమాలిగ	(,,)	మునిమాణిక్యం	0-6 0
మునిమాణిక్యం కథలు		,,	0-8-0
నీ కేంకావాలి ?	(నవల)	కుటుంబరావు	0-6-0
కవిరాట్టు	(కథలు)	,,	0-6-0
స్వగతం	(,,)	,,	0-4-0
ఇల్లరికం	(,,)	,,	0 4 0
భార్యల్లోనే ఉంది	(కథలు)	గోపీచంద్	0-6-0
దేశం ఏమయ్యేట్టు ?	(,,)	,,	0-6-0
ఉభయకుశలోపరి	(లేఖలు)	,,	1-0-0
పాపం ! ! !	(కథలు)	చలం	0-8-0
దేశద్రోహి	(,,)	పి. వి. సుబ్బారావు	0-6-0
పాతిమంగలి	(కథలు)	చక్రపాణి	0-6-0
పున్నామ నరకం	(,,)	,,	0-6-0
పాంచజన్యం	(,,)	,,	0-6-0
త్రిలోచనకవిరాజు	(,,)	,,	0-6-0
దేవదాసు	(నవల)	,,	0-8-0
పరిణీత	(,,)	,,	0-6-0
కల్కి	(కథలు)	బొడ్డు బాపిరాజు	0-4-0
యువ కథావళి	(,,)	వివిధ రచయితలు	0-4-0
ఆడమళయాళం	(,,)	,,	0-4-0
చైత్రరథం	(కథలు)	జి. వి. కృష్ణరావు	0-6-0

★ ★ మా ప్రచురణాలు హిగ్గిన్‌బాథమ్స్ బుక్ స్టాల్సులోనూ, ముఖ్యమైన పుస్తక విక్రేతలవద్దనూ దొరుకుతై. లేదా మూడు రూపాయల పుస్తకాలు ఒక్కమాటు తెప్పించుకొనువారికి ఖర్చులు మేమే భరించి పంపుతాము. పాఠకులు ఇది గమనించ ప్రార్థన.

యువ బుక్ డిపో, తెనాలి.

వెలువడింది

జి. వి. కృష్ణరావుగారి

"కావ్యజగత్తు"

వెల ఒక రూపాయి